

## రేసులో రైడర్స్.. రాణించిన రఘువంశీ, రింకూ

ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన కోల్‌కతాకు బ్యాటర్లు సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (32 బంతుల్లో 44, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రింకూ సింగ్ (25 బంతుల్లో 36, 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 190/9 పరిమితమైంది. డుప్లెసిస్(62), అక్షర్‌పటేల్(43)రాణించారు. నరైన్(3/29), వరుణ్ చక్రవర్తి(2/39).. ఢిల్లీ పతనాన్ని శాసించారు.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక


నిజామాబాద్
బుధవారం
30.04.2025

సంపుటి : 15 సంచిక: 231
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


## ప్రభుత్వాన్ని వెంటాడుతాం

- రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది
- గులాబీ దండు మరిన్ని పోరాటాలకు సిద్ధమవ్వాలి
- ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం
- టెలీ కాన్ఫరెన్స్ లో కార్యకర్తలతో కేటీఆర్ కామెంట్స్
- జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా గాయం
- కొన్ని రోజులు రెస్ట్ తీసుకోనున్నట్లుగా ప్రకటన



**చట్టం, హైదరాబాద్:** తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని, రజతోత్సవ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తితో ఆదివారం జరిగిన రజతోత్సవ సభపై నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. "రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణకు ధన్యవాదాలు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుంది. నిన్నటి సమావేశం రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమే. ఇకపై తానే ముందుండి పోరాడతానని కేసీఆర్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతాం. ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం"అని కేటీఆర్ అన్నారు.

**జిమ్ లో గాయం..**

జిమ్‌లో వర్కౌట్ చేస్తుండగా కేటీఆర్‌కు గాయమైంది. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. వైద్యుల పర్యవేక్షణలో రికవరీ అవుతున్నట్లు పేర్కొన్నారు. త్వరగా కోలుకొని రోజువారీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

# భయంలో పాక్

- పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ఖాళీ చేయిస్తున్న పాక్ సైన్యం
- భయంతో ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలివెళ్తున్న టెర్రరిస్టులు
- పాక్ ఆర్మీ చీఫ్ దేశం విడిచి పారిపోయినట్లు వార్తలు
- తమ వద్దే ఉన్నాడంటూ ఫొటో పెట్టిన పాక్ పీఎంవో
- పహల్గాం ఉగ్రవాదులను వేటాడుతున్న ఇండియన్ ఆర్మీ
- ఉగ్రవాదుల లొకేషన్ నాలుగుసార్లు గుర్తించిన సైన్యం
- ప్రధానితో రక్షణమంత్రి రాజ్ నాథ్ సింగ్ భేటీ
- భవిష్యత్ కార్యాచరణపై 40 నిమిషాల పాటు చర్చ



**చట్టం, న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది. భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి.

**కొనసాగుతున్న వేట..**

పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. "ఎలుకా పిల్లి ఆటలా సాగుతోంది.. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉంది" అని ఓ సైనిక అధికారి పత్రికల వద్ద వ్యాఖ్యానించారు.

**వారి లొకేషన్లు ఇలా..**

ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టుపక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు సైనికాధికారి వెల్లడించారు.

## కర్రెగుట్టపై బీర్ బాంబులు

- గుర్తించిన భద్రతా బలగాలు
- 7వ రోజు కొనసాగిన కూంబింగ్
- సైనికులే లక్ష్యంగా ఐఈడీలు అమర్చిన సైనికులు



**చట్టం భద్రాచలం:** ఆపరేషన్ కగార్ లో భాగంగా కీలకమైన కర్రెగుట్టను స్వాధీనం చేసుకునేందుకు భద్రతా దళాలు ప్రయత్నిస్తున్నాయి. ఇందుకోసం ఏడు రోజులుగా కూంబింగ్ జరుగుతోంది. ఏప్రిల్ 28న భద్రతా బలగాలు బీర్ బాటిల్ బాంబును, దానికి అమర్చిన వైరును కనుగొన్నాయి. కర్రెగుట్ట కొండలు 290 కిలోమీటర్ల పొడవు ఉంటాయి. ఇది అనేక చిన్న కొండల శ్రేణి. కర్రెగుట్ట కొండలు ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ అంతటా విస్తరించి ఉన్నాయి. ఛత్తీస్ ఘడ్ లోనే ఇది కాంకేర్ నుంచి బీజాపూర్ వరకు వ్యాపించి ఉంది. ఇక్కడ హిడ్మా, దేవాలాంటి నాయకులు షెల్టర్ ఏర్పర్చుకొని ఉంటారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ఈ నక్సల్ ఆపరేషన్లో, ఒక వైపు సైనికులు నక్సలైట్లతో పోరాడుతుండగా, మరోవైపు అనేక మంది భద్రతా దళాల సిబ్బంది మందుపాతరలను తొలగించే పనిలో ఉన్నారు. సైనికులను లక్ష్యంగా చేసుకుని నక్సలైట్లు 100 కి పైగా ఐఈడీలను అమర్చారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా భద్రతా దళాలు డ్రోన్ల సాయంతో కర్రెగుట్ట పై నిఘా ఉంచాయి. ఆపరేషన్ లో భాగంగా సోమవారం అడవిలోని చదును చేయని రోడ్డు నుంచి సైనికులు ఒక బీర్ బాంబును స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ గార్డ్స్, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ సైనికులు భూమి లోపల పాతిపెట్టిన బీర్ బాంబులను బయటకు తీస్తున్న వీడియో బయటపడింది.

## ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా?



**చట్టం, హైదరాబాద్:** ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. తాను సీఎం అయిన రెండో రోజు ఆయన గుండె పగిలిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అనర్థాలకు కేసీఆర్ ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేసింది ఆయన కాదా? అంటూ ప్రశ్నించారు. వరంగల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాటలపై తనదైన శైలిలో రియాక్ట్ అయ్యారు ముఖ్యమంత్రి. మాజీ సీఎం స్పీచ్ అంతా అక్కసుతో మాట్లాడినట్టు ఉందన్నారు. కేసీఆర్ సభకు ఎన్ని బస్సులు కావాలంటే అన్ని ఇచ్చామన్నారు. దానివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరిగిందన్నారు. బస్సులు ఆపితే సభ ఆగిపోతుందా? అని అనుకునే ఆలోచన వారికి ఉందన్నారు. ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభకు కనీసం బస్సులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తు చేశారు. ఆదివారం సభలో కేసీఆర్ తన అక్కసు మొత్తాన్ని బయట పెట్టుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా మీడియా మిత్రులు వేసిన కొన్ని ప్రశ్నలకు రిప్లై ఇచ్చారు. కేసీఆర్ స్పీచ్‌లో పస లేదని తేల్చారు. కేటీఆర్, హరీష్‌లను పిల్లగాళ్లు అని కేసీఆర్ అన్నారని, వారిని ఎందుకు అసెంబ్లీకి పంపిస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. చట్టం ప్రకారమే తాను నడుచుకుంటున్నానని, డిమాండ్లు వస్తున్నా, చట్టానికి వ్యతిరేకంగా అరెస్టులు చేయలేదన్నారు. చేసిన పనులు చెప్పుకోవడానికి కొంత వెనుకపడ్డామని, వాటిని స్పీడప్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రపంచంలో ఇందిరాగాంధీకి మించిన యోధురాలు లేదన్నారు సీఎం. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఆమెకే చెల్లిందన్నారు.

# గ్రూప్ 1 తీర్పుపై అప్పీలు దాఖలు చేసిన టీజీపీఎస్సీ

- సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ అప్పీలు
- బుధవారానికి వాయిదా వేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు
- తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్ -1 అభ్యర్థులకు రూ.20వేల జరిమానా
- వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం




**హైదరాబాద్:** తెలంగాణలో గ్రూప్ 1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టనుంది. గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసినట్లు టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది సింగిల్ బెంచ్‌కు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై సోమవారం జరగాల్సిన విచారణను జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారానికి వాయిదా వేశారు.

### తప్పుడు పత్రాల పిటిషన్..

తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్ 1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు రూ.20వేల జరిమానా విధించింది. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ మొత్తం 19 మంది పిటిషన్ దాఖలు చేశారు. మెమోకు, వెబ్‌సైట్‌లోని మార్కులకు తేడాలున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ చేసి మార్కులు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్లు తప్పుడు ప్రమాణ పత్రాలు దాఖలు చేశారని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ప్రాథమిక వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. అభ్యర్థులు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని పేర్కొంది. వాస్తవాలను దాచిపెట్టి కోర్టును తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్లపై చర్యలు తీసుకోవాలని జ్యుడీషియల్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది

# తెలంగాణకు తీరని అన్యాయం చేసింది కేసీఆరే

- కమీషన్ల కక్కుర్తి వల్లే లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలింది
- రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి.. అప్పులు చేసి జేబులు నింపుకున్నారు
- కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం చేశారు
- కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్



**చట్టం, నల్గొండ:** కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి నల్గొండ జిల్లా కంచుకోట అని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. భవిష్యత్‌లోనూ కాంగ్రెస్‌ను సమర్థంగా నడిపించే నేతలు ఈ జిల్లాలో ఉన్నారని చెప్పారు. నల్గొండ కలెక్టరేట్ లో అదనపు బ్లాక్ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నల్గొండ పట్టణాన్ని మంత్రి కోమటిరెడ్డి అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కితాబిచ్చారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్గొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. డిండి, ఏదుల ప్రాజెక్టులను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పదేళ్లపాటు కేసీఆర్ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం మళ్లీ పని ప్రారంభించిన కొన్ని రోజులకే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి తీరుతాం. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు నల్గొండ జిల్లా నాయకులం ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాం. సాగునీటి రంగంలో రూ.1.81 లక్షల ఖర్చు చేసి, బీఆర్ఎస్ నేతలు జేబులు నింపుకొన్నారు. బీఆర్ఎస్ నేతల కమీషన్ల కక్కుర్తి వల్లే, రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నాణ్యత లోపించి మూడేళ్లలోనే కూలిపోయింది. రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి.. అప్పులు చేసి కాళేశ్వరం పేరిట రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు సరిపోతాయని ఒప్పుకొని రాష్ట్రానికి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కానీ, తెలంగాణకే 500 టీఎంసీలు కేటాయించాలని ఈ ప్రభుత్వం పోరాడుతోంది" అని ఉత్తమ్ అన్నారు.

## పేదలందరికీ ఇండ్లు ఇస్తాం


- 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- అత్యంత పేదవారికే మొదటి ప్రాధాన్యత
- భూ భారతి చట్టం దేశానికే రోల్ మోడల్
- ధరణి ఫలితమే కేసీఆర్ ను ఓడించింది
- ఎల్కతుర్తి భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి



**చట్టం, హనుమకొండ:** పటిష్ఠమైన భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తయారు చేసిందని, రైతులను ఇబ్బంది పెట్టకుండా సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులదేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి అధికారి కూడా రైతు కుటుంబం నుంచే వచ్చినవారే ఉంటారు. వారి కష్టాలు తెలుసు కాబట్టి వాళ్లను ఇబ్బంది పెట్టకుండా సమస్య పరిష్కరించాలి. ఈ ప్రభుత్వం 20 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడతలో అత్యంత పేదవారికి ప్రాధాన్యత ఇస్తున్నాం. విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం." అని అన్నారు. భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్ అవుతుందని, ధరణి ఫలితమే కేసీఆర్ ను ఓడించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్యుల కోరిక మేరకు అంబేద్కర్ జయంతి రోజున చట్టాన్ని తీసుకువచ్చామని మంత్రి గుర్తు చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మండలం పైలట్ ప్రాజెక్టు ఎంపిక చేసి అమలు చేస్తామన్నారు. అధికారులు ఎవరు తప్పు చేసిన శిక్షించే అవకాశం చట్టంలో ఉందని తెలిపారు. రూపాయి ఖర్చు లేకుండా రెవెన్యూ అధికారులే ఇంటికి వచ్చి సమస్యలని పరిష్కరిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రత్యేక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. 20 లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పార్టీలకు అతీతంగా పేదవారికి ఇల్లు అందించేందుకు కార్యకర్తలు సహకరించాలని సూచించారు.

# మేం అనుకుంటే మీ కంటే డబుల్ మీటింగ్ పెడతాం

- కాంగ్రెస్ ను విలన్ అంటున్న కేసీఆర్ ది నోరు కాదు.. మోరి
- సోనియా కాళ్లు మొక్కిన విషయం మరిచిపోయినవా?
- తెలంగాణను మొత్తం దోచుకుతిన్నరు మీరు
- దళితుడిని సీఎం చేస్తానని దగా చేశారు
- మేం అనుకుంటే నల్లగొండలో నీకంటే డబుల్ మీటింగ్ పెడతాం
- త్వరలో ధరణి మోసాలు అన్నీ బయటపడతాయి
- తెలంగాణ.. బీఆర్ఎస్ సొంతం కాదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కామెంట్స్



**చట్టం, నల్గొండ:** బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అసలు కేసీఆర్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదంటూ విమర్శించారు కోమటిరెడ్డి. నల్గొండ కలెక్టరేట్ లో అదనపు బ్లాక్ కు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని కేసీఆర్ అంటున్నాడు. సోనియా గాంధీ కాలు మొక్కాడు కేసీఆర్. కేసీఆర్ నీది నోరా.. మోరీనా?, తెలంగాణను మొత్తం దోచుకుతిన్నారు. దళితుడిని సీఎం చేస్తానని , మూడెకరాలు ఇస్తానని మోసం చేయలేదా ?, కేసీఆర్.. మేం అనుకుంటే నల్లగొండలో నీకంటే డబుల్ మీటింగ్ పెడతాం. ధరణితో ఏం మోసాలు చేశారో అన్నీ బయటపడతాయి' అని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు.

**తెలంగాణ.. బీఆర్ఎస్ సొంతం కాదు**

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ సొంతం కాదనే విషయం తెలుసుకుంటే మంచిదని విమర్శించారు. 'వందల కోట్ల అవినీతి సొమ్ముతో మీటింగ్ పెట్టుకున్నారు. జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రులు ఉత్తమ్, కొమటిరెడ్డి సీఎం స్థాయి నాయకులు. ప్రజలు కేసీఆర్ ను కోరుకుంటున్నారంటే నవ్వుకుంటున్నారు. నిన్ను ఫాంహౌస్ కు ఎందుకు పరిమితం చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదు. దమ్ముంటే రా.మీరు నిర్మించిన ప్రాజెక్టులు ఎందుకు కూలిపోతున్నాయి. కేసీఆర్ కుటుంబం లక్షల కోట్లు ఎలా దోచుకున్నారో లెక్కలు చెప్తున్నాం. వెయ్యి జన్మలు ఎత్తినా బీఆర్ఎస్ అధికారంలోకి రాదు. బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారు. పదేళ్లలో జిల్లా అభివృద్ధి కుంటుపడింది. జిల్లాలో రైతులకు మేలు జరగలేదు. బీఆర్ఎస్ ఆగం చేసిన తెలంగాణను కాంగ్రెస్ గాడిలో పెడుతోంది. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో మంచి జరుగుతుంది. కానీ బీఆర్ఎస్ కుటుంబ పాలనలో కాదు. తెలంగాణ కోసం కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రి పదవిని త్యాగం చేశారు.

# భూ భారతి 2025 చట్టం రైతుకు ఆయుధం లాంటిది






▶ **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**చట్టం మద్నూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చినటు వంటి భూ భారతి 2025 (ఆర్.ఓ.ఆర్ చట్టం) తెలంగాణ రైతులకు ఆయుధం లాంటిదని దాన్ని సద్వినియోగం చేసుకొని రైతుల భూ సమస్యల పరిష్కారానికి వినియోగించుకోవాలని తెలిపారు. గత ధరణి పోర్టల్ వాళ్ల ఏ అధికారికి భూ సమస్యను పరిష్కరించే అధికారం లేదని, భూ భారతి చట్టం వల్ల తహసీల్దార్ నుండి ఆర్.డి.వో స్థాయి వరకు చాలా భూ సమస్యలకు పరిష్కారం దొరికే హక్కులు ఈ చట్టం లో ఉన్నాయని అన్నారు. CCLA వరకు వెళ్లకుండా ఈ చట్టం వల్ల జిల్లా స్థాయిలోనే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. దేశంలోనే ఈ భూ భారతి చట్టం ప్రతిష్ఠాత్మకమైంది అని, దేశం లోని ఏ రాష్ట్రంలో కూడా రైతుకు ఇన్ని అవకాశాలు భూ సమస్యలకు హక్కులు ఇవ్వలేదన్నారు. ఆర్. వో. ఆర్ 2025 చట్టం వలన భూ భారతి తో రైతు సమస్య పరిష్కారం కు వికేంద్రీకరణ జరగబోతుంది అన్నారు. ఈ సమావేశం లో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ధరణి చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదని కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థ ఉంటుందని , అప్పీల్ వ్యవస్థలో కూడా ఉచితంగా భూ సమస్యల పరిష్కారం కోసం న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భూ కమతాల పరిధి అనేది చెప్పడానికి ప్రతీ రైతుకు భూధార్ కార్డును, నెంబర్ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతుందని అన్నారు. గ్రామాలలోకి లైసెన్సుడ్ సర్వేయర్లు, అదేవిధంగా గ్రామ పాలన రెవిన్యూ అధికారులు రాబోతున్నారని దీనివలన భూ రిజిస్ట్రేషన్, వారసత్వ భూ బదలాయిపు వాటికి ప్రతిదానికి భూమి యొక్క చిత్రపటంను డాక్యుమెంట్లో పొందపరచడం జరుగుతుందని భూభారతి చట్టంలో ఆ విధంగా చేర్చడం జరిగిందని తెలిపారు. పట్టా పాస్ పుస్తకంలో తప్పులు జరుగుతే గతంలో మార్చడానికి సరైన విధానం లేదని ప్రస్తుత చట్టం ద్వారా తాసిల్దార్ కార్యాలయంలోనే భూభారత్ చట్టంతో మార్పులకు, చేర్పులకు అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి DCO రామ్మోహన్ మద్నూర్ మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్, ఎంపిడిఓ రాణి, మండల వ్యవసాయ అధికారి రాజు, PACS చైర్మెన్ శ్రీనివాస్ పటేల్ , రైతులు, రైతు ప్రతినిధులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## మంత్రికి స్వాగతం పలికిన నాయకులు




**చట్టం లింగం పెట్ :** రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మోతే గేటు సమీపంలో ఏర్పాటు చేసిన ఎలిప్యాడ్ లో ల్యాండ్ అయింది. ఈ సందర్భంగా మంత్రికి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్రావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వా న్, ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా గ్రంథాల చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, లింగంపేట్ మాజీ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. దారి పొడవునా శెట్టిపల్లి వరకు అడుగున కాంగ్రెస్ కార్యకర్తలు స్వాగతం పలికారు. ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రానున్న ఎలక్షన్లలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం రోజు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సన్నాహాక సమావేశం జిల్లా అధ్యక్షులు మనలా మోహన్ రెడ్డి, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతథిలుగా పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోధన్ శాసన సభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, ఎమెల్సీ బల్మూరి వెంకట్, రూరల్ శాసన సభ్యులు భూపతి రెడ్డి, రాష్ట్ర ఎస్టి కార్పొరేషన్ ఛైర్మెన్ తిరుపతి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ, ఈ వారం రోజుల్లో రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ కమిటీలు వేసి పార్టీనీ బలోపేతం చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో సంస్థాగత ఎన్నికలలో పార్టీనీ బలోపేతం చేస్తూ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలలో విస్తృ త ప్రచారం నిర్వహించి పార్టీ నాయకులను, అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచన చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఛైర్మెన్ లు, నియోజకవర్గలా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి లు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పాశం సంజీవ రెడ్డి సార్ లాంటి వారిని మున్ముందు చూడలేము



**చట్టం భూపాల్ పల్లి ప్రతినిది :** ఉపాధ్యాయ వృత్తిలో పాశం సంజీవ రెడ్డి సేవలు ఎనలేనివి ములుగు పల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం అన్నారు. మహా ముత్తారం మండలం ములుగు పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాధికారి గా పని చేస్తున్న పాశం సంజీవ రెడ్డి రజిత దేవి పదవీ విరమణ ఈ నెల 30 న సందర్భంగా వారు శుభాకాంక్షలు చెప్పి మాట్లాడుతూ.. అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని ఈ వృత్తిలో ఉన్న గౌరవం మరే వృత్తిలో లేదన్నారు. ములుగు పల్లి బడి కోసం బాగా కష్టపడ్డారని సూర్య కిరణ్ ఫౌండేషన్ ద్వారా టీ షర్ట్ లు స్ట్రీట్ సోషల్ సర్వీస్ రోటరీ క్లబ్ ఆఫ్ హన్మకొండ ద్వారసైకిల్స్ పంపిణీ చేశారు అని విజ్ఞాన విహార యాత్ర తో పాటు సుమారు 36 ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం పాటు వివిధ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేసి ఎందరో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత వారికి దక్కుతుందని అన్నారు. మండల విద్యాధికారి గా నోడల్ అధికారిగా కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ సమర్థ వంతంగా చేసి విద్యా రంగం లో మండలాన్ని ముందంజ లో నిలిపారని అన్నారు. సేవా భావమే లక్ష్యంగా పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం సంజీవ రెడ్డి ఎన్నో సేవలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని మేమంతా పని చేస్తామని అన్నారు. అంకితభావం వృద్ధి నిబద్ధత గల టీచర్ గా రాణించారని అన్నారు. వారికి విషెస్ చెప్పిన వారిలో ఉపాధ్యాయులు దాసరి రాజేంద్ర ప్రసాద్, అనిల్ నాయక్, సకారం నాయక్ , కామిడి సతీష్ రెడ్డి, చంద్ర కల ,పెనుకుల యాదగిరి, సుధాకర్ రెడ్డి ,పీ ఈ టీ వెంకటేష్ ,ఆర్టు టీచర్ బోనాల వెంకటేష్,కొంకల గీత రెడ్డి,సదయ్యనాగ్రరాజు, రాజు, రాజయ్య ,మాజీ సర్పంచు దూలం మలయ్య గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సమత, మాజీ ఎం పి టి సి రాధా రాజయ్య విద్యార్థుల పేరెంట్స్ పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

## 18 పురాణాలు – పేర్లు వివరణలు



1. మత్స్య పురాణం - మత్స్యావతారం లోని విష్ణువు కాశీ క్షేత్ర మహిమ, ధర్మ జీవన విధానాలపై వివరణ.
2. కూర్మ పురాణం - కూర్మావతారం లో ఖగోళ శాస్త్రం, పుణ్యక్షేత్రాల విశేషాలు.
3. వామన పురాణం - శివపార్వతుల కల్యాణం, గణేశుడు, కార్తికేయుడి జనన, ఋతువుల వర్ణనలు.
4. వరాహ పురాణం - భూదేవికి వరాహావతార విశేషాలు, వ్రతాలు, పుణ్యక్షేత్రాలు.
5. గరుడ పురాణం - జనన మరణ రహస్యాలు, పాప శిక్షలు, ఆత్మగమ్యం గురించి.
6. వాయు పురాణం - వాయుదేవుని ద్వారా శివతత్వం, భూగోళ, సౌర మండల విశేషాలు.
7. నారద పురాణం - వేదాంగాలు, పుణ్యక్షేత్రాల విశేషాలు నారదుడు తెలియజేసిన పురాణం.
8. స్కాంద పురాణం - స్కందుడు చెప్పిన ఈ పురాణం కాశీ, కేదారం, పుణ్యక్షేత్రాల గొప్పతనం.
9. విష్ణు పురాణం - పరాశర మహర్షి ఉపదేశం; అవతార కథలు, ధ్రువ, ప్రహ్లాద చరిత్ర.
10. భాగవత పురాణం - శుకమహర్షి పరీక్షితునికి చెప్పిన కృష్ణలీలామృతం.
11. అగ్నిపురాణం - అగ్నిదేవుని నుండి వ్యాకరణం, వైద్యం, జ్యోతిష శాస్త్ర రహస్యాలు.
12. బ్రహ్మ పురాణం - బ్రహ్మ దేవుని నుండి వర్ణధర్మాలు, స్వర్గ నరకాల వివరణ.
13. పద్మ పురాణం - గంగా మహిమ, గీతాసారం, పద్మగంధి గాథలు
14. మార్కండేయ పురాణం - దేవీ మాహాత్మ్యం, శివకేశవుల వైభవం.
15. బ్రహ్మవైవర్త పురాణం - గోలోక మహిమ, తులసీ, సాలగ్రామ విశిష్టత, రోగ నివారణ సాధనలు.
16. లింగ పురాణం - లింగతత్వం, శివవ్రతాలు, ఖగోళ జ్ఞానం.
17. బ్రహ్మాండ పురాణం - బ్రహ్మదేవుని నుండి రాధా కృష్ణుల గాథలు, లలితా మహిమ్న స్తోత్రం.
18. భవిష్య పురాణం - భవిష్యకాల సంఘటనలు, సూర్య, అగ్ని ఉపాసన విధులు.

**కామిడి సతీష్ రెడ్డి భూపాల పెల్లి జిల్లా**

## ఒప్పందం ప్రకారం రిజిస్ట్రేషన్లు చేసుకున్నాం

▶ **దౌర్జన్యం చేశారని చెప్పడం ఎంతవరకు సమంజసం**
▶ **విలేకరుల సమావేశంలో అన్నయ్య శ్రీకాంత్ ఎందుకు రాలేదు**
▶ **విలేకరుల సమావేశంలో అంబటి శ్రీధర్**




**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ లోని గ్రామ అభివృద్ధి కమిటీ విడిసి సభ్యుల సమక్షంలో అన్న శ్రీకాంత్, కు 73 లక్షలు చెల్లించి రెండు ప్లాట్లు, ఒక ఇల్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అంబటి శ్రీధర్ చెప్పారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం రోజు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అంబటి శ్రీకాంత్, అంబటి శ్రీధర్ అనే ఇద్దరు అన్నదమ్ములం విదేశాలకు వెళ్లి కష్టపడి ఆస్తులు సంపాదించాన్నారు. తన పెళ్లి అయిన తర్వాత అమ్మ ఆస్తులు పంచి ఇవ్వాలని అన్నకు చెప్పడంతో తీవ్రంగా కొట్టాడన్నారు. దీంతో అమ్మ లక్ష్మి, గ్రామ అభివృద్ధి కమిటీని ఆశ్రయించిందన్నారు. విడిసి ఆధ్వర్యంలో ఇద్దరం రెండు ప్లాట్లు, ఒక ఇల్లు గురించి వేలం పాట పాడడం జరిగిందన్నారు. తన వద్ద నుంచి రూ. 73 లక్షలు చెల్లించి 2 ప్లాట్లు, ఒక ఇంటిని అన్న శ్రీకాంత్ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడన్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత బెదిరించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో అన్నయ్య శ్రీకాంత్ ఎందుకు రాలేదన్నారు. తనను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నచ్చజెప్పడంతో తాను ఒప్పందం కంటే అదనంగా రూ. 2 లక్షల 70 వేలు అధికంగా ఇచ్చానని చెప్పాడు. డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వీడీసీ వారు దౌర్జన్యం చేశారని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత అన్న, వదినలు ఇల్లు ఖాళీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటికి సంబంధించిన 6 లక్షల పైచిలుకు డబ్బులను మధ్యవర్తిగా ఉన్న భూమన్న వద్ద పెట్టడం జరిగిందన్నారు. ఇల్లు ఖాళీ చేసిన వెంటనే భూమన్న వద్ద నుంచి తీసుకోవచ్చన్నారు. శ్రీకాంత్ కు మొదట 23 లక్షలు, రెండోసారి నాలుగు లక్షలు, మూడోసారి 20 లక్షలు బ్యాంక్ అకౌంట్ లో 20 లక్షలు డబ్బులు చెల్లించినట్లు ఆయన వివరించారు. చెల్లించిన రశీదులను మీడియా సమావేశంలో చూయించారు. విడిసి సభ్యులు అన్న శ్రీకాంత్ ను ఏనాడు బెదిరించలేదన్నారు. అంబటి లక్ష్మి, మాట్లాడుతూ చిన్న కుమారుడు శ్రీధర్ పెళ్లి తర్వాత ఆస్తి పంపకం చేయాలని చెప్పడంతో పెద్ద కొడుకు శ్రీకాంత్, కోడలు సాహితి, కలిసి కొట్టడంతో విడిసిని ఆశ్రయించానన్నారు. కొడుకులిద్దరూ ప్లాట్లు, ఇంటి కోసం విడిసి సభ్యుల ఎదుట వేలంపాట పాడడం జరిగిందన్నారు. ఇందులో చిన్న కుమారుడు శ్రీధర్, రెండు ప్లాట్లు, ఇంటిని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించిన తర్వాత పెద్ద కుమారుడు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని అన్నారు. అయితే డబ్బులు తీసుకున్న తర్వాత బెదిరించారని చెప్పడం పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో నిహారిక, స్వరూప పాల్గొన్నారు.

## భూభారతి చట్టం దేశానికి రోల్ మోడల్




▶ **రాష్ట్రంలో మళ్ళీ వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ**
▶ **రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు**
▶ **రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**చట్టం, లింగంపేట్ :** జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలు అవుతుందని, దేశానికి రోల్ మోడల్ గా ఉండేలా భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని రాష్ట్ర రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళ వారం భూభారతి అవగాహన సదస్సులో భాగంగా మండలంలోని ఫైలట్ మండలంగా ఎంపికైన లింగంపేట మండలం షెట్పల్లి గ్రామంలో భూ భారతి అవగాహన సదస్సులో అయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శెట్టిపల్లి గ్రామానికి చెందిన చల్ల సాయవ్వ, బక్క భూదేవ అయ్యపల్లి తండాకు చెందిన దేవి సింగ్ , కిష్టయ్య పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి రైతుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... దేశంలోని 18 రాష్ట్రాలకు అధికారులను పంపించి అక్కడ అమలయ్యే రెవిన్యూ అంశాలను పరిగణలోకి తీసుకుని భూ భారతి చట్టాన్ని 9 నెలల మేథోమధనం తర్వాత మేధావుల సూచనలు, సలహాలతో అసెంబ్లీ లో ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ చట్టం అమలైతే తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని ప్రతిపక్షాలు ప్రబుద్ధులు బిల్లు పాస్ కాకుండా చూసారన్నారు. ఆనాటి చట్టానికి రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఏమి లేవని, దొరకు ఏది అనిపిస్తే అదే రూల్ అమలు చేసారని విమర్శించారు. భూ భారతి 2025 చట్టం భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రూపొందించడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు నియోజకవర్గంలో జిల్లాకు ఒక మండలాన్ని ఫైలట్ ప్రాజెక్టుగా తీసుకోవడం జరిగిందని, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సూచన మేరకే లింగంపేట మండలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. గతంలో అధికారుల చుట్టూ రైతులు తిరిగేవారని, ఇప్పుడే అధికారులే గ్రామాలకు వస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మన మండలంలో 23 గ్రామాల్లో 20 గ్రామాల్లో తహసీల్దార్ స్థాయి అధికారి వచ్చి సమస్యలు తెలుసుకున్నారని, రెండు రోజుల్లో మిగిలిన గ్రామాలలో సమస్యలు తెలుసుకుంటారని, ఇప్పటికే 3400 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్, సిసిఎల్ఏ స్థాయిలో పరిష్కారం దొరుకుతుందని, అవసరం అయితే స్పెషల్ ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేసేలా చట్టంలో పొందుపరచడం జరిగిందన్నారు. తహసీల్దార్, ఆర్డీఓ, ఏ రెవెన్యూ అధికారి అయినా ఉద్దేశ్యపూర్వకంగా తప్పు చేస్తే రెవిన్యూ పరిధిలోనే సమస్య పరిష్కరిస్తారన్నారు. నాడు విఆర్ఓ, వీఆర్ఏ లు చెప్పినట్టు వినలేదని అర్ధ రాత్రి గట్టుమీద వదిలేసారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 10956 గ్రామాల్లో రెవిన్యూ అధికారులను పది, పదిహేను రోజుల్లోనే నియమిస్తామని మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో సర్వేయర్ల కొరత ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 380 మంది సర్వేయర్ల మాత్రమే ఉన్నారని, కొత్తగా మరో 6 వేల మంది సర్వేయర్లను పెట్టబోతున్నామన్నారు. భవిష్యత్తులో భూముల అమ్మకాల విషయంలో ఇబ్బందులు రాకుండా మ్యాపింగ్ చేసే అంశాన్ని చట్టంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం చేయలేని పనులు తమ ప్రభుత్వం చేస్తుందని దొరకు కన్నీళ్లు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ రెండో తారీకు నుండి ఆగస్టు 15 తారీకు వరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు, రాజీవ్ యువ వికాసం ద్వారా జిల్లాకు మూడు నాలుగు వేల మంది యువతకు రూ.50 వేల నుంచి 5 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇస్తున్నామన్నారు. వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ప్రతి పేదోడి కష్టం తీర్చేలా, హామీలు అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ , బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఏఎంసీ చైర్మన్ రజిత వెంకట రామిరెడ్డి, ఆర్డీఓ మన్నే ప్రభాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, ఎమ్మార్వో సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయా శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన



**చట్టం, ఇందల్వాయి :** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామానికి చెందిన 1994 95 విద్యార్థులు మంగళవారం పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన జరుపుకోవడం చాలా సంతోషకరమని విద్యార్థినీ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడ వెళ్లిన పాత జ్ఞాపకాలు మర్చిపోలేకుండా ప్రతి ఒక్కరు ఈరోజు కలిసిమెలిసి ఉన్నారు అంటే కేవలం ఆ భగవంతుని దయ అని అనుకోవచ్చు ఇలాంటి సమ్మేళనం మరెన్నో జరుపుకోవాలని విద్యార్థి విద్యార్థులు అందరూ సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని పూర్వ విద్యార్థులు కోరుకుంటున్నారు.

## జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో మంగళవారం రోజు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఎంఆర్ గార్డన్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్గట్ల మండలం, తాళ్లరంపూర్ గ్రామంలో శ్రీరామనవమి రోజు గుడికి వచ్చిన గౌడ కులస్థులను వీడీసీలు వెళ్లగొట్టడం బాధాకరమన్నారు. గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలను అరికట్టాలని ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి ఆర్డీవో కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ అధ్యక్షుడు నరసింహా చారి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాంయాదవ్, యదాగౌడ్, ప్రభాకర్, గంగాధర్, దత్త్రాది, రామగౌడ్. రవినాథ్, బట్టు నరేందర్, శంకర్, భూమన్న, యువర్ డిపి రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యుఎఫ్ ఆర్టిఐ గ్రామ కన్వీనర్ గా రాకేష్ నియామకం




**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, గోరుకొత్తపల్లి, మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ, (యు ఎఫ్) గ్రామ కన్వీనర్ గా బిల్లా రాకేష్ నియమించినట్లు ఆర్టిఐ మండల కన్వీనర్ మాసు రాజు తెలిపారు.ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. అవినీతి అక్రమాలకు అవినీతి అధికారం ప్రశ్నించే గొంతుకనై పని చేస్తానని సమాచార హక్కు చట్టం ప్రజల చేతులు వజ్రాయుధంగా పనిచేస్తుందని అవినీతి అక్రమాలకు తావు లేకుండా అవినీతి పాలనకు అడ్డుకట్టవేసేందుకు ఉపయోగపడుతుందని నన్ను ఎన్నిక చేసినందుకు మండల కన్వీనర్ కు జిల్లా కమిటీకి మండల కమిటీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** సొంత రక్త సంబంధీకులే వివిధ కారణాలతో విడిపోయిగొడవలు పడి మానవత్వ విలువలను మంటగలుపుతున్న తరుణంలో తోటి స్నేహితుడి తండ్రి మరణం పట్ల స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించి తోటి స్నేహితులు మానవత్వాన్ని చాటుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి నవీన్ తండ్రి కుమ్మరి సమ్మయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా 2012 13 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన కుమ్మరి నవీన్ స్నేహితులు జన్నె రాజ్ కుమార్, ఇల్లందుల విజయ్ కుమార్, బొచ్చు ప్రకాష్, నాగన బోయిన రాకేష్ యాదవ్, వైనాల అజయ్, బొచ్చు రాజు, తంగళ్ళపల్లి హరీష్, జన్నె రేష్మ, కట్ల మమత, వనపర్తి రుతీష, చల్ల మమత, పోతరాజు జ్యోతి, పసరగొండ శ్రీలత, గాదె రమ్య, చేపూరి రజిత, వైనాల శిరీషలు విరాళాలుగా వేసుకుని రూ.5000 రూపాయలను ఆర్థిక సహాయాన్ని అందించారు.

## చెరువు తూముల షట్టర్ల మరమ్మతు చేయించాలి



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అతిపెద్ద గుండ్ల చెరువుకు మూడు తూములు ఉన్నాయని. వాటి షట్టర్లు పనిచేయక పంటకు నీరందక ఎండిపోయి రైతులు నష్టపోయారని. తూముల షట్టర్లను మరమ్మతు చేయించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డికి రైతులు మంగళవారం రోజు వినతి పత్రం అందజేశారు. ఇరిగేషన్ శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి చెరువుల తూముల మరమ్మతుకై నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు మూడు పంతాల కాశి హనుమాన్, గురడి కాపు, కా పెల్లి పంథాల రైతులు, ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మే డేను జయప్రదం చేయాలి



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు మే డే వి జయప్రదం చేయాలని వికారాబాద్ జిల్లా బిఆర్టియు అధ్యక్షులు టైగర్ భూముల కృష్ణయ్య పిలుపు నిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా 8 గంటల పని కోసం కార్మికవర్గం యాజమాన్యాలపై పోరాటాలు చేసి అనేకమంది అమరులయ్యారని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లాలోని అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, వైద్య ఆరోగ్యశాఖ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ప్రైవేటు కంపెనీల కార్మికులు, ఆటో కార్మికులు, కాంట్రాక్ట్ ,అండ్ ఔట్సోర్సింగ్ కార్మికులు ,ఫీల్డ్ అసిస్టెంట్లు, మెప్మా ఆర్పీలు, వీఆర్ఏలు, మరియు వివిధ రంగాల కార్మికులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మండల కేంద్రంలో మేడే జెండా కార్యక్రమాలను ఎగురవేయాలని ,అలాగే ప్రతి కంపెనీ ముందు, ప్రతి సంస్థ ముందు, మేడే జెండాలు ఎగరవేయలని, ర్యాలీలు సభలు జరపాలని కోరారు.

## జడ్జి ప్రియాంకకు భద్రాచల తలంబ్రాలు అందజేత



**చట్టం, సిద్దిపేట (దుబ్బాక) :** భద్రాచల రామయ్య కళ్యాన ముత్యాల తలంబ్రాలను శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజు మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంకకు ముత్యాల తలంబ్రాలు, సీతారాముల శేష వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రియాంక మాట్లాడుతూ.. ఆ భద్రాచల రామయ్యనే ఈ తలంబ్రాల రూపకంగా మా ఇంటికి భద్రాచల రామయ్య వచ్చారని సంతోషిస్తున్నానన్నారు. తలంబ్రాలు అందిరికి అందించాలనే రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం అన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచండి



**చట్టం, నసురుల్లాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించిన సందర్భంగా కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం, రాముల గుట్ట తండాలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న పనులను పరిశీలించిన ఎంపీడీవో సూర్యకాంత్, మండల స్పెషల్ అధికారి దయానంద్. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని మంజూరైన వారు 90 రోజుల్లోపు నిర్మాణ పనులు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మైలారం గ్రామ శివారులో గల నర్సరీనీ పరిశీలించారు. ఈపరిశీలనలో మండల పరిషత్ అధికారి ఎంపిడిఓ సూర్య కాంత్, స్పెషల్ ఆఫీసర్ దయానంద్, టి ఏ బలరాం, ఏపీఓ, గ్రామ సెక్రెటరీలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పివిఆర్ భవన్ లో మంగళవారం రోజు కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి, స్వయంగా బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి 60000, 20000, 22,500, 60000, రూపాయలకు చెందిన నాలుగు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇప్పించిన ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి ఘన సన్మానం



**చట్టం, కోరుట్ల ప్రతినిధి :** ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కోరుట్ల పట్టణంలోని గంగంపేట్ కు చెందిన అబ్దుల్ రాయన్ కు 1000 మార్కులకు గాను 994 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకును సాదించాడు. ఈ అసాధారణ విజయాన్ని పురస్కరించుకొని అబ్దుల్ రాయన్ ను ఘనంగా సన్మానించిన ఆల్ ఉమర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి అబ్దుల్ మొబిన్ ఆల్ ఉమర్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎండి జాకిర్ మౌలానా, వైస్ ప్రెసిడెంట్ ఎండి వాజీద్, వైస్ ప్రెసిడెంట్ ఎండి ఇర్ఫాన్, క్యాషియర్ ఎండి మోసిన్, జనరల్ సెక్రటరీ ఎండి అలిముద్దీన్, ఎండి మజీద్, ఎండి షకీల్, ఎండి వసీం, అక్రమ్, అబ్దుల్ రాయన్ స్నేహితులు ఉన్నారు.

## వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గం లోని నందిపేట మండలం ఖుదావంద్ పూర్, కోదండపురం గ్రామంలో గల శ్రీ కోదంపురం శ్రీ లక్ష్మి ఆండాళ్ సామెత శ్రీ వేంకటేశ్వర స్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ని ఆహ్వానించిన గ్రామ గుడి కమిటీ సభ్యులు గుండు భూమన్న, భూసింద్ల గంగాధర్, ఒడ్డే సాయిలు, బ్యాగారి గంగాధర్, గజారి గంగమల్లు, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్, మాజీ ఉప సర్పంచ్ మంగ్లారపు చిరంజీవి, వెంకటేశ్వర గుడి కమిటీ సభ్యులు.

## అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్ ప్రారంభం




**చట్టం, ఎల్బీనగర్ :** ఎల్బీనగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ మోయిన్ అలీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమ్మర్ మేళా 2025 అండర్ వాటర్ ఫిష్ టన్నల్ ఎగ్జిబిషన్ ఏప్రిల్ 25 నుండి జూన్ వరకు కొనసాగనున్నది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ మోయిన్ అలీ మాట్లాడుతూ.. ఈ ఎగ్జిబిషన్ లో షాపింగ్, అమ్యూజ్మెంట్స్, ఫుడ్ కోర్ట్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. టైమింగ్స్ వచ్చేసి సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు ఉంటాయని అన్నారు. మూడు నాలుగు, సంవత్సరాల పిల్లలకు ఉచితంగా ఎంట్రీ ఉంటుందని అన్నారు. 15 అమ్యూజ్మెంట్స్ రైట్స్ ఉన్నాయని, 150 వరకు స్టాల్స్ ఉన్నాయని అన్నారు. అమెజాన్ ఫ్రెష్ వాటర్ ఫిష్ టన్నల్ ఏర్పాటు చేశామని అందులో 300 రకాల చేపలను ప్రదర్శిస్తున్నామని అన్నారు. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకునేది 60 కిలోల అతిపెద్ద ఎరోపామ చేపను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ మొత్తం 24 గంటలు సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటుందన్నారు. ఇందులో దొరికే ప్రతి ఐటమ్ చాలా అందుబాటు ధరల్లో లభిస్తాయని అన్నారు. కావున పరిసర ప్రాంత ప్రజలు ఈ సమ్మర్ వెకేషన్ లో కుటుంబ సమేతంగా వచ్చి ఇక్కడ సందడి చేయాలని సూచించారు. మరిన్ని వివరాల కొరకు 8686864772 నెంబర్ కు సంప్రదించాల్సిందిగా కోరారు.

## పహల్గామ్ లో ఉగ్రదాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ




**చట్టం, నాగోల్:** ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్ బండ్లగూడ ఐకాన్ వాకర్ సంఘం ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్ పహల్గామ్ లో టూరిస్టులపై ఉగ్రవాద దాడికి నిరసనగా,ప్రాణాలు కోల్పోయిన అమాయక టూరిస్టుల ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగ్ర దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని,ఈ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను భారత ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తూర్పాటి చిరంజీవి, ఈశ్వర్ గౌడ్, సిహెచ్ చిరంజీవి గౌడ్, పెంటారెడ్డి, నరేందర్ రెడ్డి, ,సిహెచ్. రమేష్ గౌడ్, చందు, బాబు, చారి, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని, నివాళులు అర్పించడం జరిగింది.

# "సమానత్వానికి పునాది వేసిన తాత్వికుడు" బసవేశ్వరుడు





**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** భారతీయ చరిత్రలో ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చిన మహానుభావుడు "శ్రీ బసవేశ్వరుడు". ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ తృతీయ నాడు ఆయన జయంతిని ఘనంగా జరుపుకుంటారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళ నాడు రాష్ట్రాల్లో బసవ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఈ రోజు బసవేశ్వరుడి ఆధ్యాత్మిక, సామాజిక మార్పుల గురించి మనం స్మరించుకుంటాం మరియు వాటిని కొనసాగించడంలో మన బాధ్యతను గుర్తించుకుంటాం.

**బసవేశ్వరుడి జీవితం:**
బసవేశ్వరుడు 12వ శతాబ్దంలో కర్ణాటక రాష్ట్రం బగవడి గ్రామంలో జన్మించారు. తన చిన్ననాటి నుంచి మానవ సమానత్వం, సామాజిక సంక్షేమం, భక్తి మరియు శ్రమ, గౌరవం గురించి గాఢమైన అర్థం కలిగి, తన జీవితాన్ని ప్రజల సంక్షేమం కోసం అంకితం చేశారు. సమాజంలో కుల, జాతి, మత పక్షపాతం లేకుండా ప్రతి వ్యక్తికి సమాన హక్కులు ఉన్నాయని నమ్మిన బసవేశ్వరుడు, "వీరశైవ లింగాయత్" మతాన్ని స్థాపించి, అందులో సమానత్వం, శ్రమ, భక్తి పైన ఆధారపడి, ఒక ధార్మిక పునరుద్ధరణకు అంగీకారం ఇచ్చారు.

**సామాజిక సంస్కరణలు:**
బసవేశ్వరుడు సమాజంలోని వివక్షతలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆయన "అనుభవ మంటపం" పేరిట ప్రపంచానికి పార్లమెంట్ వ్యవస్థను పరిచయం చేసి, ప్రప్రథమ వేదికను స్థాపించి, అన్ని వర్గాల ప్రజలు కలిసి చర్చలు జరిపి, ఒకటే పద్ధతిలో జీవించగలుగుతారనే సందేశాన్ని ఇచ్చారు. కుల, మత, లింగ ఆధారంగా వివక్షతను ఖండించారు. ఈ మార్పు సమాజంలో ప్రతిభ, శ్రమ, ఆధ్యాత్మికత వంటి అంశాలను ముఖ్యంగా చర్చించడానికి కారణమైంది.

**వర్ణవ్యవస్థ వ్యతిరేకి, సమాన హక్కుల ప్రతిపాదకుడు:**
బసవేశ్వరుడు వర్ణవ్యవస్థను, కులాల పరిమితులను వ్యతిరేకించి, అందరికి సమానమైన హక్కులు ఉండాలని, "మానవులంతా ఒక్కటే" అని అభ్యర్థించారు.

**డా. బాబా సాహెబ్ అంబేద్కర్ దృష్టిలో బసవేశ్వరుడు:**
డా. బి.ఆర్. అంబేద్కర్ బసవేశ్వరుని ఉద్యమాన్ని కులవ్యవస్థను నిరోధించే, సమానత్వం మరియు మానవహక్కుల కోసం పోరాటం చేసిన వ్యక్తిగా, ఒక గొప్ప సామాజిక సంస్కరణ వాదిగా, సమానత్వం కోసం పోరాడిన "తాత్వికుడు"గా అంబేద్కర్ ప్రశంసించారు. బసవేశ్వరుడు ప్రతి మనిషికి సమాన గౌరవం, హక్కులు ఇవ్వాలని నిరంతరం బోధించారు. ఆయన ఉద్యమం దళిత జనులకు ధైర్యం, గౌరవం మరియు స్వేచ్ఛను అందించడంలో కీలకంగా నిలిచిందని, బసవేశ్వరుడి ని ఒక గొప్ప సమాజ మార్పునాయకుడి గా గౌరవించారు. ఆయన సమానత్వ సిద్ధాంతాలు, బహుజనుల హక్కుల పరిరక్షణకు మార్గదర్శకాలుగా నిలిచాయి. బసవేశ్వరుడు చూపిన దిశను అనుసరించి, అంబేద్కర్ గారు దళితుల ఆకాంక్షలకు ప్రత్యామ్నాయంగా సమాజంలో అందరికి సమానమైన హక్కులు పొందేందుకు ప్రయత్నించారు.

**భక్తి, శ్రమ మరియు సమానత్వం:**
బసవేశ్వరుడు భక్తిని కేవలం ఆధ్యాత్మికతకు పరిమితం చేయలేదు. శ్రమను, ప్రతిభను, సమానత్వాన్ని ఒక అంగీకారంగా తీసుకున్నాడు. "కాయకవే కైలాస" అంటే శ్రమతోనే మోక్షం పొందవచ్చు అని చెప్పాడు. ఆయన విజ్ఞానాన్ని ప్రజల భాషలో చెప్పడం ద్వారా వారికి ఆధ్యాత్మిక దృష్టిని చేరవేశారు. ఆయన వచనలలో ప్రజలకు సమానత్వం, శ్రమ, భక్తి, మానవత్వం వంటి అంశాలు ప్రస్తావించబడి అవి ఆత్మచింతనను పెంచాయి.


**పెళ్లి వ్యవస్థలో మార్పులు:**
బసవేశ్వరుడు పెళ్లి వ్యవస్థలో కూడా మార్పులను సూచించారు. సంప్రదాయ కుల వివక్షాలను త్యజించి, ప్రేమ, సమానత్వం, మానవ హక్కుల ఆధారంగా పెళ్లిని నిర్వహించాలని సూచించారు. పురుషులు, మహిళలు, దళితులు, ఇతర సామాజిక వర్గాలు సమానంగా పెళ్లి చేసుకోవాలి అని ఆయన నమ్మారు. ఈ మార్గదర్శనం ప్రాముఖ్యతను కలిగి ఉండి, నేటికి ఎలాంటి పురాతన సంప్రదాయాలను పాటించకుండా బసవ జయంతి రోజు అనేక "సామాజిక పెళ్లిళ్లు" జరుగుతూనే ఉన్నాయి.

**ప్రస్తుత సమాజంలో ప్రాముఖ్యత:**
నేటి సమాజంలో కూడా బసవేశ్వరుడు సందేశాలు సంబంధితమైనవి. కుల, మత, లింగ వివక్షతలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన సూచించిన మార్గాలు మన సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆయన నమ్మిన సమానత్వం, మానవ హక్కులు, ఆత్మగౌరవం మరియు శ్రమకు గౌరవం ఇచ్చే సిద్ధాంతాలు, సామాజిక సంస్కరణకు ప్రేరణ నిచ్చాయి. ఈ సందర్భంగా సమాజంలో కుల, జాతి, లింగ వివక్షతను తొలగించి సమానంగా జీవించే దిశగా ముందుకు సాగాలి.

**ముగింపు:**
ఈ బసవ జయంతి సందర్భంగా, బసవేశ్వరుడు చూపించిన మార్గాన్ని మనం ఆచరించాలి. ఆయన చూపిన మార్గం కేవలం "భక్తి మార్గం కాదు, అది సమాజానికి మార్పు తీసుకు రాబోయే మార్గం". మానవత్వాన్ని, సమానత్వాన్ని ప్రోత్సహించడమే బసవేశ్వరుడికి మనం ఇచ్చే సన్మాన మార్గం. నేటి సమాజంలో ప్రేమ, సమానత్వం, మానవ హక్కుల పరిరక్షణ కోసం, కుల, మత, లింగ వివక్షను తొలగించి బసవేశ్వరుని ఆశయాల సాధన నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేయాలని మనవి. "బసవేశ్వరుని ఆలోచనలు సమ సమాజానికి చిరస్మరణీయ స్ఫూర్తి."

**వ్యాసకర్త:** వెంకట్ కిందిగేరి. విద్య విభాగపు పూర్వ విద్యార్థి, పాలమూరు యూనివర్సిటీ. **ఫోన్: 95733 56356**

## ఆర్డర్ మెస్లో పనిచేస్తూ గవర్నమెంట్ కొలువు సాధించిన విద్యార్థి



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన యువకుడు రాసూరి నిఖిల్, ఇటీవల జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విష్ణు, నీలిమలతో కలిసి తమ ఆర్డర్ మెస్లో పని చేసుకుంటూ సమయం దొరికినప్పుడు చదువుకుంటూ పరీక్షలకు సన్నద్ధమయ్యానని వెల్లడించారు. గత ఐదు సంవత్సరాల నుండి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగం చేస్తూనే పై స్థాయి ఉద్యోగం కొరకు ప్రిపేర్ అవుతున్నట్లు తెలిపారు. ఆయన తల్లిదండ్రులు మాట్లాడుతూ నా కొడుకు కష్టపడి చదివి ప్రభుత్వ కొలువు సాధించడం మాకు ఎంతో గర్వకారణం అన్నారు. ఉద్యోగం కొరకు సన్నద్ధమవుతున్న సమయంలో చూసుకుంటాము నీ చదువు నువ్వు చూసుకో అన్నట్టుగా తెలిపారు. అయినా మా కష్టాన్ని చూసి మాకు తన వంతు సహాయం చేస్తూ ఉద్యోగం కొరకు సన్నద్ధమయ్యేవాడని తెలిపారు. భగవంతుడి దయతో ప్రభుత్వ కలుగుతకడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

## పెండింగ్ లో ఉన్న డి.ఏ లను వెంటనే విడుదల చేయాలి



**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** పెండింగ్ లో ఉన్న డి.ఏ లను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ ఎంప్లాయిస్ జే ఏ సీ సిద్దిపేట జిల్లా కో చైర్మన్ దరిపల్లి నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులందరిని ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఆర్థిక వ్యవస్థ ఇబ్బంది ఉంది అని సాకుతో ఉద్యోగులకు అన్యాయం చేస్తుందని ఇప్పటివరకు ఒకటో తారీకు జీతం తప్ప ఏమి ఇవ్వలేదని గత ప్రభుత్వంలో డిక్లేర్ చేసి ఎన్నికల కోడ్ వలన ఆగినటువంటి డి ఎ మాత్రమే చెల్లించరని ఇంకా పెండింగ్ డి ఎ లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒకటవ తారీకు జీతాలు ఇస్తున్నాము అని చెబుతూ ఉద్యోగులకు రావలసిన న్యాయమైన డి ఏ లను పెండింగ్లో ఉంచిందని అలాగే పెన్షనర్లకు రావాల్సినటువంటి బకాయిలను చెల్లించాలని అలాగే మేనిఫెస్టోలో పెట్టి ఉద్యోగులందరి సమక్షంలో ఇచ్చిన సి పి ఎస్ రద్దు హామీని వెంటనే నెరవేర్చాలని ఓ పి ఎస్ ని అమలు చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చినటువంటి హెల్త్ కార్డుల విషయంలో జీవోను ఇంప్లిమెంట్ చేసి ప్రతి ఉద్యోగి కి క్యాష్ లెస్ ట్రీట్మెంట్ ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు. చాలామంది ఉద్యోగులకు రిటైర్మెంట్ అయిన తర్వాత బెనిఫిట్స్ విషయంలో అన్ని బిల్లులను పెండింగ్లో ఉంచుతున్నారని రిటైర్డ్ ఉద్యోగులు బిల్లుల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పిఆర్సి కమిటీ రిపోర్టు తెప్పించుకొని వెంటనే పిఆర్సి అమలయేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించిందని ఇంకా మిగిలిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగులను మరియు అధ్యాపకులకు క్రమబద్ధీకరించి వెట్టి చాకిరి బానిస బతుకులకు చరమ గీతం పాడాలని, అలాగే గత కొన్ని రోజులుగా యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, గెస్ట్ , ప్రొఫెసర్లు రోడ్లపైకి వచ్చి ధర్నా చేయడం జరుగుతుందని వారిని పిలిచి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే సిద్దిపేట జిల్లా ఆల్ ఎంప్లాయిస్ జేఏసీ కో చైర్మన్ గా నియమించిన టీ జీ ఈ జే ఏ సి చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్ కి మరియు టీ యన్ జీ ఓ ప్రధాన కార్యదర్శి విక్రం రెడ్డి , తెలంగాణ రాష్ట్ర ఆల్ ఎంప్లాయిస్ జే ఏ సి సెక్రేటరి మరియు తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కనక చంద్రం కి ధన్యవాదాలు తెలిపారు .

## సేంద్రియ సాగుకు సమాయత్తం!



**చట్టం,మచిలీపట్నం :** జిల్లాలో ఈ ఏడాది తొలి విడతగా 141 గ్రామ పంచాయతీల్లో 59,206 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు ప్రణాళికను అధికారులు రూపొందించారు. గత నెల రోజులుగా ఈ అంశంపై ఎంపిక చేసిన గ్రామాల్లో అవగాహనా సదస్సులను వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గే విధానం, నాణ్యమైన ఉత్పత్తులకు లభించే అదనపు ఆదాయం, మార్కెటింగ్ సౌకర్యాలు తదితర అంశాలను వివరించి ఈ సంవత్సరం ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేసేలా రైతులను చైతన్యవంతం చేస్తున్నారు. దీంతో పాటు 890 హెక్టార్లలో ఉద్యాన పంటల సాగును విస్తరింపజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యాన పంటల సాగులో 100 హెక్టార్లలో పండ్ల జాతి మొక్కల పెంపకం, 50 హెక్టార్లలో కూరగాయలు, పూలసాగు, 690 హెక్టార్లలో వివిధ రకాల తోటలు, 50 హెక్టార్లలో సుగంధ ద్రవ్య మొక్కల సాగుకు ప్రణాళికను రూపొందించారు. వచ్చే నెలలో రైతులు, డ్వాక్రా మహిళలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. జూన్ నుంచి సేంద్రియ వ్యవసాయ ప్రక్రియ ప్రారంభించనున్నారు.

**32 రకాల విత్తనాలు చల్లితే..**
భూసారాన్ని పెంచేందుకు ఇప్పటి వరకు జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను మాత్రమే వ్యవసాయ శాఖ సిఫార్సు చేసేది. ఈ ఏడాది నుంచి భూసారాన్ని మరింతగా పెంచేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం ద్వారా 32 రకాల విత్తనాలను పొలంలో చల్లాలని చెబుతున్నారు. పప్పుజాతి గింజలు, నూనె గింజలు, పూల జాతి, సుగంధ ద్రవ్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి విత్తనాలను ఎకరానికి ఎంత చల్లాలనే అంశంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మినుము, పెసర, బొబ్బర్లు, జనుము, జీలుగ, పిల్లిపెసర, గోధుమలు ఒకకేజీ చొప్పున వేసవి దుక్కుల అనంతరం, తొలకరి సమయంలో చల్లాలి. వీటితో పాటు రాగులు, కొర్రలు, సామలు, మొక్కజొన్న, జొన్నలు అరకిలో చొప్పున పొలంలో వేయాలి. మెంతులు 50 గ్రాములు, ధనియాలు 200 గ్రాములు, తోటకూర, గోంగూర విత్తనాలు 50గ్రాముల చొప్పున చల్లాలి. వంగ, టమాటా, గోరు చిక్కుడు విత్తనాలు 100 గ్రాముల చొప్పున, బెండ, బీర, కాకర, అనప, గుమ్మడి విత్తనాలు 50గ్రాముల చొప్పున, నువ్వులు 150 గ్రాములు, ఆముదం లేదా పొద్దు తిరుగుడు విత్తనాలు 250 గ్రాములు, ఆవాలు 100 గ్రాములు, వేరుశెనగ విత్తనాలు అరకిలో, బంతి విత్తనాలు 100 గ్రాములు మొత్తంగా ఎకరానికి 13.500 కిలోల విత్తనాలను చల్లాలని శాస్త్రవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. ఈ విత్తనాల ఖరీదు సుమారు రూ.1200 నుంచి రూ.1300 వరకు ఉంటుంది.

## ఆలయ ప్రతిష్టాపన మహోత్సవానికి ఆహ్వానం



**చట్టం, గాంధారి :** కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో నారాయణగిరి కొండపై నూతనంగా నిర్మించబడుతున్న శివ భక్త మార్కండేయ ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వాన పత్రికను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు కు ఆలయ కమిటీ సభ్యులు అందజేయడం జరిగింది. మే 12 ,13, 14 తేదీల్లో నిర్వహించే ఆలయ ప్రారంభ మహోత్సవాలకు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. మార్కండేయ ఆలయ గుడికి సీసీ రోడ్డు త్వరలోనే నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యేకు తెలుపడం జరిగింది. ఈ ఆహ్వాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేష్, మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సహకార సంఘం చైర్మన్ పెద్దబురి సాయికుమార్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో వివక్ష తగదు



**చట్టం, శంకరపట్నం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో వివక్ష చూపెడుతుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి అన్నారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు ఎంపికలో ఇందిరమ్మ కమిటీ పేరుతో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తూ కేవలం ఇందిరమ్మ కమిటీ కాంగ్రెసు నాయకులకు సిఫారసు చేసిన జాబితానే అధికారులు సర్వే చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ ఇండ్లు మంజూరు చేస్తామని చేసిన వాగ్దానం రేంవత్ రెడ్డి నిలుపుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలలో టిఆర్ఎస్ పార్టీ గ్రామాలలో ఏ ఒక్క ఇల్లు మంజూరు చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీని నమ్మి సామాన్య ప్రజలు ఇల్లు వస్తుందని ఆశతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అలాంటి సామాన్యులను సంవత్సర కాలంగా ఊరిస్తూ తీర ఇడ్లు ఇచ్చే సమయానికి సవ లక్ష కొర్రీలు పెడుతూ వారి ఆశలపై నీళ్లు చల్లుతుందని పెర్కొన్నారు. కొలతల సాకుతో సైతం సామాన్యులకు ఇండ్లను దూరం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దొంగల రాములు, దాసరపు నరేందర్, రాసమల్ల శ్రీనివాస్, బిజిలి సారయ్య, చెర్ల శ్రీనివాస్, గూళ్ళ రాజు, గుర్రం శ్రీనివాస్, అమరగొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన జనసేన సభ్యులు




**చట్టం, శంకరపట్నం :** శంకరపట్నం మండల కేంద్రంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జనసేన పార్టీ సభ్యులైన రాకేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పడాల ప్రసాద్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనసేన ప్రజలకు ఉపయోగపడే పనులను స్వచ్ఛందంగా చేస్తుందని పడాల ప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బండారి తిరుపతి, హరికృష్ణ గౌడ్, హిసాముద్దీన్, అభిలాష్ గౌడ్ బొంగోని, గోడిషాల ప్రవీణ్ గౌడ్, పంజాల పర్శరాములు, వ్యాపార వర్తకులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎంపీటీసీ దంపతులు..



**చట్టం బీర్కూర్ :** బాన్సువాడ మండలము బోర్లం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రావణి దేవేందర్ రెడ్డి దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలతిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామినీ సుప్రభాత సేవలో దర్శించుకునారు, ఈ సందర్భంగా ఆమె తన గ్రామ ప్రజలు పాడిపంటలు సుఖ సంతోషాలతో పాటు తన కుటుంబం కూడా ఆనందంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్లోల దేవేందర్ రెడ్డి,పట్లోళ్ల నిశాంత్ రెడ్డి,బి.ప్రశాంత్ రెడ్డి మరియు బంధుమిత్రులు తదితరులు పాల్గొనడం జరిగింది.


# మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలి

- దళిత గిరిజన ఆదివాసీ ప్రజా సంఘాల డిమాండ్




**చట్టం మహబూబాబాద్ ప్రతినిధి :** ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వ బలగాలు మావోయిస్టులపై హత్యా కాండ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామనీ, ఆ ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని దళిత గిరిజన ఆదివాసి ప్రజా సంఘాల నాయకులు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగాప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ సిద్ధబోయిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ ప్రతినిధులను చర్చలకు పిలవాలని మావోయిస్టు పార్టీని అంతం చేయాలని ఛత్తీస్‌గఢ్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో బలగాలను మోహరించి వారి తుడిచిపెట్టాలని కేంద్రం ప్రకటించిందనీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చివరి మావోయిస్టును చంపేదాకా వదిలిపెట్టబోమని మాట్లాడటం ప్రజాస్వామిక దేశంలో అత్యంత అభ్యంతకర విషయం అని తెలిపారు. సైన్యం తమ సొంత ఆస్తిగా ఆయన మాట్లాడటాన్ని ఖండిస్తున్నామన్నారు. చర్చలకు పిలవాలని మావోయిస్టు పార్టీ ప్రతినిధులు అడుగుతుంటే వారిని గౌరవించి పిలువకుండా తుదిముట్టించేదాకా వదలబోమనటం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆదివాసీలను నిర్మూలించే పద్ధతిని మోడీ సర్కారు కొనసాగిస్తున్నదన్నారు. సాయుధులైన మావోయిస్టులకు, పోలీసు బలగాలకు మధ్య జరుగున్న యుద్ధంలా అది లేదనీ, బలగాలు అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేసి వారిని అడవుల నుంచి వెళ్లగొట్టేలా ఉందని చెప్పారు. అక్కడ మానవ, ఆదివాసీ, గిరిజన హక్కులను హరణ జరుగుతున్నదని వాపోయారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర దాని వెనుక ఉన్నదని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో తెలంగాణలోని రెండు మండలాలు కూడా ఉన్నాయని తెలిపారు. భారత్ సమ్మిట్‌లో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, ఆదివాసీ, గిరిజన హక్కులపై కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌లు చేస్తే సరిపోదనీ, ఆదివాసీలపై జరుగుతున్నదాడిని ఆపేలా కేంద్రంపై ఒత్తడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గూగుల్ రివ్యూ మీటింగ్ లో ఎం. ఎల్. ఏ



**చట్టం రామగుండం:** రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ పాలకుర్తి అంతర్గాం మండలాలకు చెందిన గ్రామ అధ్యక్షులతో గూగుల్ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డబల్ బెడ్ రూమ్ అదే విధంగా చూడాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రామాల్లో అమలు అవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజల సమస్యలు మొదలైన అంశాలపై ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామస్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడైన పేదవాడికి నివాస గృహం లభించాలి. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఒక్కరి కూడా మినహాయించకుండా, నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి మంజూరు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం," అని స్పష్టం చేశారు. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గ్రామ స్థాయికి చేరాలని, అందులో పాలకుర్తి మండలాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ మీటింగ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింధు నది జలాలు పాకిస్తాన్ కి వెళ్లకుండా ఆపితే మీ గొంతు తడి ఆరుతుందా...



**చట్టం రామగుండం :** అంతర్గం మండలంలో నిర్వహించిన బీజేపీ బంద్ విజయవంతంగా, ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకు బీజేపీ శ్రేణులు మండల అధ్యక్షులు బోడకుంట సుభాష్ ఆధ్వర్యంలో చేరుకొని బంద్ నిర్వహించారు. బంద్ అనంతరం సుభాష్ మాట్లాడుతూ.... జమ్మూలోని పహల్గంలో టెర్రరిస్ట్ లు దాడి చేసి 27 మంది ని పొట్టన పెట్టుకోవడం హెయమైన చర్య.... దీనికి పూర్తి బాధ్యత పాకిస్తాన్ దే..... దేశం అవతల ఉన్న తీవ్రవాదుల కంటే దేశం లోపల ఉన్న ద్రోహులు అత్యంత ప్రమాదకరం.... సింధు నది జలాలు ఆపి పాకిస్తాన్ ను చావు దెబ్బ తీస్తే సబబు కాదు అంటూ ప్రతిపక్షం మాట్లాడడం కూడా ద్రోహమే... పాకిస్తాన్ కు నీళ్లు ఆపితే ప్రతిపక్షం గొంతు ఆరినట్టు ఉంది... ఇట్లాంటి సంక్లిష్ట సమయంలో ఐక్యతగా ఉండి ఖండించాలి.. అతి త్వరలో పాకిస్తాన్ దేశాన్ని ప్రపంచ చిత్ర పటం లో లేకుండ చేసే ప్రక్రియ కొనసాగుతుంది. ప్రధాని మోడీ కి 140 కోట్ల భారతీయులు అండ గా ఉన్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోడకుంట సుభాష్, మాడ అనిల్ రెడ్డి, అలకుంట మల్లేష్, బాలసాని సత్యం గౌడ్, తమ్మన్నావేణి మల్లేష్, ఆకుల హరీష్, కొల్లూరి పురుషోత్తం, బొంతు రఘు మాడ ప్రభాకర్ రెడ్డి, బాధవత్ అనిల్ నాయక్, గంగారాం తదితరులు పాల్గున్నారు.

## సర్కిల్ ఇన్స్పెక్టర్ సమక్షంలో స్పెషల్ డ్రైవ్




**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మేట్ పల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్, పాతబస్టాండ్, బస్ డిపోల వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్, బస్ స్టేషన్ లో భద్రపరిచామని సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. వాహనదారులు తమ యొక్క సరైన వాహన పత్రాలను తీసుకువచ్చి చాలానా చెల్లించి తీసుకు వెళ్ళగలరని సిఐ అన్నారు. పట్టణంలో మూడు ప్రాంతాలలో ఒకేసారి వాహనాల తనిఖీలు నిర్వహించడంతో వాహనదారులు కంగు తిన్నారు. ఈ తనిఖీలో సబ్ ఇన్స్పెక్టర్ రాజ్ నాయక్, కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, మల్లాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పహల్గాంలో ఉగ్రవాద దాడులను ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన



**చట్టం భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి :** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేపట్టిన ఈ దాడిని దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా ఆయన అభిప్రాయపడ్డారు. ఈ దాడికి మతాలు, రాజకీయాలు, లేదా ఏ ఇతర భేదాలను పైకి తీసుకోకుండా, దేశవ్యాప్తంగా అందరు ఐక్యంగా పోరాడాలని పాయం అన్నారు. ఈ దాడిలో మరణించిన బాధిత కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాధితులకు తగిన న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన హితవు పలికారు పాయం, క్షతగాత్రులందరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ దారుణ దాడికి తగిన శిక్షలు కల్పించేందుకు సంబంధిత అధికారులపై ఒత్తిడి పెంచాలని సూచించారు. పార్టీల నాయకులు కార్యకర్తలు కలసి కొవ్వొత్తులతో నిరసన తెలిపి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గంపూడి కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సంస్థల్లో ప్రమోషన్లకు బ్రేక్

- రివ్యూ పిటిషన్లు తేలే వరకు స్టే
- ప్రమోషన్లల్లో ఓసీ, బీసీలకు అన్యాయమంటూ పిటిషన్లు
- గత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ ఉందన్న విద్యుత్తు సంస్థలు



**చట్టం, హైదరాబాద్:** రాష్ట్రంలోని విద్యుత్తు సంస్థల్లో పనిచేసే వారికి పదోన్నతులు కల్పించరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలకు మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేశారు. 2014 జూన్ 2 నుంచి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించడం వల్ల నష్టపోయిన ఓసీ, బీసీ ఉద్యోగులకు కూడా సీనియార్టీ మేరకు పదోన్నతులు కల్పించాలని 2018లో వెలువడిన కోర్టు ఆదేశాలను రివ్యూ చేయాలన్న పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్లకు ఏవిధమైన ఉత్తర్వులు జారీ చేయవద్దంటూ విద్యుత్తు సంస్థలు చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఈ ఉత్తర్వులు వెలువడి ఏడేండ్లు అయ్యిందని, ఇప్పటివరకు అమలు కాలేదని, రివ్యూ పిటిషన్‌పై తుది ఉత్తర్వులు వెలువడే వరకు పదోన్నతులు కల్పించరాదని ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ఆవిర్భావం జరిగిన 2014 జూన్ 2 నుంచి ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించడం వల్ల నష్టపోయిన ఓసీ, బీసీ ఉద్యోగులకు కూడా సీనియార్టీ మేరకు పదోన్నతులు కల్పించాలని 2018లో హైకోర్టు ఆయా విద్యుత్తు సంస్థలకు ఉత్తర్వులు జారీచేసింది. అన్ని క్యాటగిరీల ఉద్యోగుల సీనియార్టీని సమీక్షించి బీసీ, ఓసీ ఉద్యోగులకు కూడా ఆయా నిష్పత్తి మేరకు పదోన్నతులు కల్పించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ తాజాగా పిటిషన్లు దాఖలయ్యాయి. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది గోడ శివ వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో జారీచేసిన ఉత్తర్వుల మేరకు తెలంగాణలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లోని ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటు జరిగిన జూన్ 2, 2014 నుంచి ఇచ్చిన పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులతో సమానంగా సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించకపోవడం వల్ల బీసీ, ఓసీ ఉద్యోగులు నష్టపోతున్నారని చెప్పారు. దీనిపై విద్యుత్తు సంస్థల తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. ఇప్పటికే రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉన్నందున పిటిషనర్లకు అనుకూలంగా ఏ విధమైన ఉత్తర్వులనూ జారీ చేయవద్దని కోరారు. ఇరు పక్షాల వాదనల విన్న హైకోర్టు.. ఓసీ, బీసీలకు కూడా పదోన్నతులు కల్పించాలని ఉత్తర్వులు వెలువడి ఇప్పటికే ఏడు సంవత్సరాల కాలం అయిపోయిందని గుర్తుచేసింది. ధర్మాసనం 2018లో ఉత్తర్వులు ఇచ్చిందని, దీనిపై దాఖలైన రివ్యూ పిటిషన్ మీద కూడా విచారణ పూర్తిచేసి తుది ఉత్తర్వులను వెలువరించే వరకు అన్ని విద్యుత్తు సంస్థల్లోని సిబ్బందికి ఎలాంటి పదోన్నతులు ఇవ్వరాదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.

**తీర్పును స్వాగతించిన ఉద్యోగుల జేఏసీ**

విద్యుత్తు సంస్థల్లో ఉద్యోగుల పదోన్నతులను నిలిపివేస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను బీసీ, ఓసీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కోడేపాక కుమారస్వామి, వైస్ చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ సీ భానుప్రకాశ్ తదితరులు స్వాగతించారు. యాజమాన్యాలు మొండి వైఖరి ప్రదర్శించకుండా, పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా తెలంగాణ, ఏపీ సచివాలయాల్లో సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని, విద్యుత్తు సంస్థల్లో అమలు చేయకపోవడం అన్యాయమని బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు వ్యాఖ్యానించాయి.

## 45 వింటేజ్‌కార్లు.. 23 లక్షల నగదు!



**చట్టం, హైదరాబాద్:** భూదాన్ భూముల వ్యవహారంలో పాతబస్తీలోని పలువురి ఇండ్లలో తనిఖీలు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం పలు విషయాలను వెల్లడించింది. ఖదీర్‌ఉన్నీసా, మునావర్‌ఖాన్, లతీఫ్ షర్ఫాన్, అక్తర్ షర్ఫాన్, సుకూర్‌ల నివాసాల్లో సోదాలు జరిపి 45 వింటేజ్‌కార్లు, రూ.23 లక్షల నగదు, 12,000 యూఏఈ దిర్హామ్‌లు, భూములకు సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వ అధికారులు కలిసి నకిలీ పత్రాలు తయారు చేసి ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించినట్టు ఈడీ గుర్తించింది. మాహేశ్వరం మండలం, నాగారం గ్రామంలోని భూదాన్ భూమిని ఖదీరున్నీసా తాను వారసత్వంగా పొందినట్టు నకిలీ పత్రాలు సృష్టించి, అధికారుల అండదండలతో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి, మధ్యవర్తుల సహకారంతో ప్రైవేట్ వ్యక్తులకు అమ్మినట్టు ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ మధ్యవర్తులు ప్రభుత్వ అధికారులతో చేతులు కలిపి నకిలీ పత్రాలతో ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, అమాయకులకు విక్రయించారని ఈడీ తెలిపింది. ఈ కేసు ఇంకా దర్యాప్తులో ఉందని అధికారులు చెప్పారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయించండి

**చట్టం, హైదరాబాద్:** ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయకపోతే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉన్నదని, ప్రాణనష్ట నివారణకు కృషిచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్కకు భారత్ బచావో సంస్థ విజ్ఞప్తిచేసింది. ప్రజాభవన్‌లో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు గాదె ఇన్నయ్య, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, జంజర్ల రమేశ్‌బాబు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా మీ వంతుగా చొరవ చూపాలని కోరారు. వేల సంఖ్యలో కేంద్ర బలగాలు కర్రెగుట్ట ప్రాంతాల్లో సంచరిస్తుండటంతో ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. సంస్థ ప్రతినిధుల వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే వ్యవహరించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శాంతియుత వాతావరణం నెలకొల్పడమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని సూచించారు.



## యువజన కాంగ్రెస్ సదస్సుకు నాయకులు..



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి):** తెలంగాణ యువజన కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి కామారెడ్డి యువజన కాంగ్రెస్ నేతలు హైదరాబాదులో హాజరు కావడం జరిగింది. మంగళవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించడం జరిగిందని కామారెడ్డి అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుడుగుల శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మమత అజ్మత్ అలీ లు తెలిపారు.జిల్లాలోని మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కూడా హాజరు కావడం జరిగింది అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తీసుకెళ్లడానికి ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని సూచించినట్లు వారు తెలిపారు

## ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు వైయస్

- రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన వరం
- ధరణి చట్టంతో భూస్వాములకు దొరలకు మేలు
- ఎంపీ సురేష్ సెట్కార్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన వరం అని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ అన్నారు. మంగళవారం లింగంపేట మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలోని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి చట్టం వల్ల ఎంతోమంది రైతులు నష్టపోయారని అన్నారు, ధరణి చట్టం వల్ల భూస్వాములు, దొరలకి మేలు జరిగింది తప్ప బీద ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. ఈ సందర్భంగా ఆయన నారాయణఖేడ్ నియోజకవర్గం లోని పెద్ద శంకరంపేట్ మండలంలో ఒక రాజా కుటుంబం రాణి శంకరమ్మ ఉండేదని అయితే ఆమె ఎంతో మది రైతులకు భూములు ఇచ్చిందని ఆ భూములను రైతులు కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. అయినప్పటికీని కేసీఆర్ తెచ్చిన ధరణి చట్టం వల్ల మళ్ళీ తిరిగి ఆ భూములన్ని రాణి శంకరమ్మ పేరుని పట్టా బుక్కులు వచ్చాయన్నారు. దీంతో రాణి శంకరమ్మ వారసులు వచ్చి ఈ భూములు రికార్డు ప్రకారం మావే అని మాభూమి మాకు కావాలని పేద ప్రజల నుండి లాక్కున్నారని అన్నారు. దీంతో రైతులు చేసేదేమీ లేక వారసులకు లక్షల రూపాయలు చెల్లించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూభారతి 2025 చట్టం పేద ప్రజల భూ సమస్యల పరిష్కారం కొరకేనని అన్నారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే తాసిల్దార్ వద్ద పరిష్కారం అవుతాయని అక్కడ పరిష్కారం కాని సమస్యలు ఉటే ఆర్డిఓ వద్ద పరిష్కారం చేసుకోవచ్చని అక్కడ కూడా పరిష్కారం కాకుండా ఆ సమస్యను జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లాలన్నారు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కామారెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయడానికి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రాణహిత చేవెళ్లతో 22 ప్యాకేజీ ను ప్రారంభించారని కానీ అది అర్ధాంతరంగా ఆగిపోయింది అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి పునః ప్రారంభించేందుకు సనీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. కామారెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయని, లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే అటవీశాఖ రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉన్న వివాదాస్పద భూములు కూడా భూభారతి చట్టం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధరణి చట్టంతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు

- భూభారతీతో భూసమస్యలన్నీ పరిష్కారం
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు



**చట్టం న్యూస్ లింగంపేట్ :** గత పాలకులు ధరణి చట్టం తూగో పేరుతో కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్రావు ప్రతిపక్షాలపై మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం లింగంపేట మండలం శెట్పల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహనా సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రెవిన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, ఎంపీ సురేష్ శెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతు లింగంపేట మండలన్ని భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ గ ఎంపిక చేసినందుకు రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ ను అడ్డుపెట్టుకొని కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించుకున్నారని అన్నారు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ముఖ్యంగా రైతులు భూసమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు. ధరణి పోస్టల్ ద్వారా దళితల భూములు పోయాయన్నారు పేదలకు న్యాయం జరగలేదన్నారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయారన్నారు. మండలంలో భాయంపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, మంబోజిపేట, పర్మల్ల, ఎక్కపల్లి తాండ, నాగిరెడ్డిపేట మండలం పోచారం తదితర గ్రామాల్లో భూ సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మాల్లో అధికారంలోకి వస్తుందని ఆయన ధమా వ్యక్తం చేశారు. భూభారతి చట్టం తేవడంతో రైతుల భూమి సమస్యలు తొలిగిపోతాయి అని ధీమా వ్యక్తం చేసారు. లింగంపేట మండలం భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక అయిన విషయం తనకు తెల్వగానే చాల సంతోషం అనిపించింది అని ఎమ్మెల్యే అన్నారు. ఎల్లారెడ్డి చరిత్రలో రెవెన్యూ మంత్రి రావడం ఇదే మొదటిసారి అని తెలిపారు. అతి తక్కువ సమయంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మళ్లి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని ఆయన ధమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల కలలు కాలలుగానే మిగిలిపోతాయాన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మాజీ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మండల కాంగ్రెస్ co ఆర్డినేషన్ కమిటి సభ్యులు అట్టెం శ్రీనివాస్, మణిగిరి నాగరాజు, ఎల్లమయ్య, సీనియర్ నాయకులు ఒంటరి సిద్ధారెడ్డి, కిష్టాగౌడ్, అప్రోజ్, రఫీ యుద్దీన్, సలీం ఇర్ఫాన్ సక్రు ప్రసాద్ గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గోపాల్, లక్ష్మీనారాయణ, యూత్ ఉపాధ్యక్షులు సాయిబాబా, యూత్ నాయకులు రాజు, నగేష్, అశోక్ కౌడ, రవి, ఈర్ల శ్రీనివాస్, సాయికుమార్ తో పాటు తాజా మాజీ సర్పంచులు గ్రామ కమిటీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యువత చేతిలోనే దేశ భవిష్యత్తు




**చట్టం, నాగోల్ :** రానున్న దేశ భవిష్యత్ యువతదేనని, స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ ది కీలకపాత్ర ఉండబోతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రాక్ టౌన్ కాలనీలో ఎస్వీఎల్ కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ నేతలు మంత్రివర్యులు మాట్లాడుతూ....రానున్న దేశ భవిష్యత్తు యువతదే అంటూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి యువజన కాంగ్రెస్ కృషి మరువలేనిది అన్నారు. దేశంలో బిజెపి నరేంద్ర మోడీ నిరంకుశ పరిపాలనకు యువత త్వరలోనే చరమగీతం పాడి రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ ని ప్రధానిగా చూస్తామని తెలిపారు. యువజన కాంగ్రెస్ కు సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీ కి యువజన కాంగ్రెస్ గుండెకాయ అలాంటిదని కొనియాడారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్, యువజన కాంగ్రెస్ జాతీయ ఇన్చార్జి కృష్ణా అల్లవారు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్, రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి , టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ, జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీ తదితర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీడిసి ఆగడాలను అరికట్టాలి

**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లాలో వీడిసి ఆగడాలను అరికట్టాలని ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కూరపాటి అరుణ జ్యోతి అన్నారు. మంగళవారం రోజు ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నా కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా ప్రజలకు గ్రామ అభివృద్ధి కమిటీల ద్వారా అన్యాయం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విడిసి బాధితులకు మేం అండగా ఉంటామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీను తదితరులున్నారు.

# భూ భారతి 2025 చట్టం రైతుకు ఆయుధం లాంటిది

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**చట్టం డోంగ్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన టు వంటి భూ భారతి 2025 (ఆర్.ఓ.ఆర్ చట్టం) తెలంగాణ రైతులకు ఆయుధం లాంటిదని దాన్ని సద్వినియోగం చేసుకొని రైతుల భూ సమస్యల పరిష్కారానికి వినియోగించు కోవాలని తెలిపారు. గత ధరణి పోర్టల్ వాళ్ల ఏ అధికారికి భూ సమస్యను పరిష్కరించే అధికారం లేదని, భూ భారతి చట్టం వల్ల తహసీల్దార్ నుండి ఆర్.డి.వో స్థాయి వరకు చాలా భూ సమస్యలకు పరిష్కారం దొరికే హక్కులు ఈ చట్టం లో ఉన్నా యని అన్నారు. CCLA వరకు వెళ్లకుండా ఈ చట్టం వల్ల జిల్లా స్థాయిలోనే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. దేశంలోనే ఈ భూ భారతి చట్టం ప్రతిష్ఠాత్మకమైం ది అని, దేశం లోని ఏ రాష్ట్రంలో కూడా రైతుకు ఇన్ని అవ కాశాలు భూ సమస్యలకు హక్కులు ఇవ్వలేదన్నారు. ఆర్. వో. ఆర్ 2025 చట్టం వలన భూ భారతి తో రైతు సమస్య పరిష్కారం కు వికేంద్రీకరణ జరగబోతుంది అన్నారు. ఈ సమావేశంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడు తూ ధరణి చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదని కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని భూ భారతి చట్టంలో అప్పిలు వ్యవస్థ ఉంటుందని , అప్పీల్ వ్యవస్థలో కూడా ఉచితంగా భూ సమ స్యల పరిష్కారం కోసం న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భూ కమతాల పరిధి అనేది చెప్పడాని కి ప్రతీ రైతుకు భూధార్ కార్డును, నెంబర్ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతుందని అన్నారు. గ్రామాలలోకి లైసెన్సుడ్ సర్వేయర్లు, అదేవిధంగా గ్రామ పాలన రెవిన్యూ అధికారు లు రాబోతున్నారని దీనివలన భూ రిజిస్ట్రేషన్, వారసత్వ భూ బదలాయిపు వాటికి ప్రతిదానికి భూమి యొక్క చిత్రపటంను డాక్యుమెంట్లో పొందపరచడం జరుగుతుందని భూభారతి చట్టంలో ఆ విధంగా చేర్చడం జరిగిందని తెలిపారు. పట్టా పాస్ పుస్తకంలో తప్పులు జరుగుతే గతంలో మార్చడానికి సరైన విధానం లేదని ప్రస్తుత చట్టం ద్వారా తాసిల్దార్ కార్యా లయంలోనే భూభారత్ చట్టంతో మార్పులకు, చేర్పులకు అవకాశం ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి DCO రామ్మోహన్ డోంగ్లి మండల తహ సీల్దార్ క్రాంతి, ఆర్ఐ సాయిబాబా, ఎంపిడిఓ నరసయ్య, ఏఈఓ యోగేష్ PACS ఛైర్మెన్ రామ్ పటేల్ , మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పరమేష్, రైతులు, రైతు ప్రతినిధులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా నిర్వహిస్తున్న జ్యోతి క్లిన్ సీజ్



**చట్టం, కోరుట్ల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజ కవర్గం మేట్ పల్లి పట్టణంలోని జ్యోతి క్లినిక్ ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీఎమ్ హెచ్వో అధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఎలాంటి అనుమతు లు అర్హత కలిగిన వైద్యులు లేకుండా రోగులకు చికిత్సలు చేస్తున్నారని నిర్దారించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీజ్ చేశారు. అక్రమంగా క్లినిక్ నిర్వహిస్తున్న వారిని పో లీసులకు అప్పజేప్పడం జరిగిందని అన్నారు. జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ గుర్తింపు లేకుండా, అర్హత కలిగిన డాక్టర్లు లేకుండా చికిత్సలు అందిస్తున్న వాటిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి ఎల్లాల అజిత్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం



**చట్టం, తూప్రాన్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఇంటర్మీడియట్ ప్రవేశ సీటు పొందేందుకు దరఖాస్తులను కొరడం జరుగుతుందని తూప్రాన్ మండల కేంద్రంలోని రావెల్లి గ్రామ శివారులోని మహాత్మ జ్యోతిబా పూలే సర్సాపూర్ బాలకల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రవేశ అవకాశా లను వచ్చేనెల మే 12 వరుకు విద్యార్థులు సద్వినియోగం చేసుకుని దరఖాస్తులు అందజేయలని పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే ఇంటర్మీడియట్ అడ్మిష న్స్ కోసం దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని ఇలాంటి మంచి అవకాశా లను విద్యార్థులందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ నర్సాపూర్ బాలికల జూనియర్ కళాశాలలో ఎం.పి.సి, బై.పి.సి కోర్సుల అడ్మిషన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే లో చదివిన విద్యార్థులకు కేవలం ప్రిన్సిపాల్ కి ఒక అర్జీ పెట్టుకుంటే సరిపోతుందని, ఇతర పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్ లైన్లో అప్లికేషన్ పెట్టుకోవాల్సి ఉందని ప్రిన్సిపాల తెలిపారు.


## మేడే ను ఉత్సవంగా నిర్వహించాలి



**చట్టం, భద్రాచలం :** కార్మికుల పండుగైన మేడే ను ఒక ఉత్సవంలా అన్ని కార్మిక వాడల్లో ఘనంగా నిర్వహించాలని ఈ వేడుకలలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని కాంక్షిస్తూ మేడే కరపత్రాలను పట్టణంలోని కార్మిక కూడలి లా వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారు శరత్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టాక కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ కోడ్ల పేరుతో కార్మిక హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు మేడేను ఒక వేదికగా ఉపయోగిం చుకోవాలని కోరారు. వేలాదిమంది కార్మికులు తమ ప్రాణాలను బలిదానం చేసి సాధించుకున్న హక్కులకు సూచికగా ప్రపంచ కార్మికుల ఐక్యతను తెలియజేస్తూ ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని నియమిస్తూ మేడే ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని కార్మిక అడ్డాల వద్ద జెండా ఆవిష్కరణ కార్య క్రమాలను నిర్వహించి అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఈ ప్రదర్శనలో అన్ని రంగాల కార్మికులు ఎర్ర చొక్కాలు ధరించి ప్రదర్శనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం బి నర్సారెడ్డి పట్టణ కోర్ కమిటీ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు పారిల్లి సంతోష్ కుమార్ కొలగాని రమేష్ అప్పారి రాము అజయ్ కుమార్ గుమ్మడి నాగరాజు జాకీర్ గజ్జల సూర్యరాజు తదితరులు పాల్గొని కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు

## మే డే ను జయప్రదం చేద్దాం!


- **కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటానికి సిద్ధమవుదాం.!**
- **పినపాక ప్రభాకర్, రాష్ట్ర కన్వీనర్, కార్మిక సంక్షేమ సంఘం, తెలంగాణ**



**చట్టం షాద్ నగర్ ప్రతినిధి:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసే విధంగా పలు చట్ట సవరణలు చేస్తోందని, ముఖ్యంగా తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ లు కార్మికుల భవిష్యత్తు ను నాశనం చేసేలా ఉన్నాయని కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. మే డే సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...ఈ మేడే కార్మికుల ఐక్యతకు, పోరాట స్ఫూర్తికి నాంది కావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, శాశ్వత ఉద్యోగాల తొలగింపు, చట్టవిరుద్ధంగా కాంట్రాక్ట్ కార్మికుల నియామకాలు వంటి చర్యలు పెరిగిపోతున్నాయని, పరిశ్రమల్లో యాజమాన్యాలు తమ ఇష్టానుసారంగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయ ని ఆరోపించారు. ప్రావిడెంట్ ఫండ్ కట్టకపోవడం, భద్రతా ప్రమాణాలు పా టించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తున్నా, అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.అనేక పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ప్రభాకర్.చట్టాల అమలు కాకపోవడం వల్ల కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. బీజేపీ తీసుకువచ్చిన లేబర్ కోడ్ లను రద్దు చేయకపోతే కార్మికులు కట్టు బానిసలుగా మారాల్సి ఉంటుందని హెచ్చరిం చారు.ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గళం వినిపించాలన్నారు. సంఘాలు వేర్వేరైనా, జెండాలు వేరు అయినా, లక్ష్యం ఒక్కటే – కార్మిక హక్కుల రక్షణ. అందుకే ఐక్యంగా ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు.ప్రజలు మాయ మాటలతో మోసపోవద్దని, వాస్తవాలను తెలుసుకోవాలని, కార్మికుల పక్షాన నిలబడి పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని స్పష్టంచేశారు. మే డే కార్యక్రమాలలో కార్మికులు విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని పినపాక ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## అలా చేస్తే రాష్ట్రం అగ్నిగుండలా మారుతుంది.. కాంగ్రెస్ సర్కార్‌కు ఆర్ కృష్ణయ్య వార్నింగ్

**చట్టం, కాచిగూడ:** బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుండా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే.. రాష్ట్రం అగ్నిగుండలా మారుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. తెలంగాణ బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన 15 బీసీ సంఘాలతో మంగళవా రం కాచిగూడ అభినందన హోటల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. దేశంలో అధిక శాతం బీసీలు ఉన్నారని, గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీ వాదం బలంగా ఉందని తెలిపారు. అందుకే రాజ్యాంగాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం పెంచాలని, అందుకోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, చట్టం చేసి ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. రానున్న కాలం బీసీలదే రాజ్యమేనని ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ అధిష్టానం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజ్యాధికార దిశగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.



## దొంగలతో జాగ్రత్త : ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి



**చట్టం రామాయంపేట :** వేసవి కాలము దొంగలతో జాగ్రత్తగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడు తూ వేసవి కాలం సెలవులు ప్రారంభం అయినవి పెళ్లి ముహూర్తాలు, స్నేహితులతో, ఫ్యామిలీ మెంబర్స్ తో అంతా టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలకు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. దొంగతనాల నియంత్రణ కోసం జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహ కరించాలని తెలిపారు. ఇంటి బయట, డాబాల పైన పడుకునేవారు మెడలో నగలని జాగ్రత్తగా పెట్టుకోండి మరియు ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచకండి. బస్సుల్లో ప్రయాణాలలో మీ బ్యాగ్ను మీ పైన ఉంచుకొని గట్టిగపట్టుకొని వెంట అంటిపెట్టుకోండి, గుర్తు తెలియని వ్యక్తులు తిను బండరాలు, కూల్డ్రింక్స్ లాంటివి ఇస్తే తినకండి తీసుకోకండి. మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవ డం ఉత్తమం. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువాలోని బట్టల క్రింద కానీ, ఇంట్లో కానీ పెట్టి వెళ్లవ ద్దు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి గేటు బయట గొళ్ళెం పెట్టకండి. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచండి. బయట గేటుకు లోపల నుంచి తాళం వేయండి. బయటకు వెళ్ళేపుడు ఇంట్లో మరియు బయట లైట్ వేసి ఉంచండి. పేపర్ బాయ్ మరియు పాలు వేసే వాళ్లకు రావద్దని చెప్పండి. నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే నియమించుకోం డి. మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వండి. ఊరికి వెళ్ళిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది. మీ కాలనీలో సీసీ కెమెరాల ను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది. మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని DVR రహస్య ప్రదేశాలలో భద్రపర్చుకోవాలి. మరియు మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది. మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయండి

## చిరుత కొరకు గాలింపు

- **చిరుత పులిని పట్టడానికి ట్రాప్, కెమెరాలు ఏర్పాటు**

**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రం లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్ట శివాలయం ఆవరణలో చిరుత పులి సంచారం తెలిసిందే. దాని యొక్క ప్రతి అణువును పరిశీలించడానికి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ మంగళవారం రోజు తెలిపారు. భక్తులు ఉదయం సూర్యోదయ కాలం నుండి సాయంకాలం సూ ర్యాస్తమయం వరకే దర్శనం చేసుకోవాలని. గుంపులు గుంపులుగా రావాలని, సాయంత్రం వేళలో గుట్టపైకి ఎక్క కూడదని, అతి తొందరలోనే చిరుత పులిని పట్టు కుని జూపార్కు కు తరలిస్తామన్నారు. ఫారెస్ట్ పోలీస్ అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, పూజారులు, ఫారెస్ట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సమ్మెపై ఆర్టీసీ జేఏసీ కీలక ప్రకటన



**చట్టం, హైదరాబాద్:** తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు తమ సమ్మె తేదీని ప్రకటించారు. మే 7వ తేదీ నుంచి కార్మికలు సమ్మెకు వెళ్లబోతున్నట్లు ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదుర వెంకన్న స్పష్టం చేశారు. మేడే స్ఫూర్తితో ఆర్టీసీ సమ్మెకు సిద్ధమయ్యామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి.. తమ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయ మైన డిమాండ్లపై వెంటనే స్పందించాలని ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆర్టీసీ కార్మిక జేఏసీ సమావేశమైంది. ఈ సందర్భంగా సమ్మెకు సంబం ధించిన వాల్ పోస్టర్‌ను ఆర్టీసీ కార్మిక జేఏసీ విడుదల చేసింది. అనంతరం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదుర వెంకన్న మాట్లాడుతూ.. సమ్మెకు ముందు అంటే.. మే 5వ తేదీన ఆర్టీసి కార్మికులు.. కార్మిక కవాతు నిర్వహిస్తామన్నారు. ఆర్టీసి కళ్యాణ మండపం నుంచి బస్సు భవన్ వరకు ఈ సమ్మెకు మద్దతుగా ఆర్టీసి యూనిఫారంలో కార్మికులం తా ఈ కవాతులో పాల్గొంటారన్నారు. అయితే కొన్ని ఆర్టీసీ కార్మికుల సంఘాలు జేఏసీలోకి వస్తామని చెప్పి.. మళ్లీ యాజమాన్యంతో మద్దతుగా తమతో కలవడం లేదన్నారు. యూనియన్‌లకు అతీతంగా అందరు సమ్మెకు కలిసి రావాలి ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదుర వెంకన్న పిలుపు నిచ్చారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ వేగవంత చేయాలంటూ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణకు మూలమైన ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం కొనుగోలు చేసి నడపాలన్నారు. 2021 వేతన సవరణ చేయాలని.. అలాగే పెండింగ్ బకాయిలను సైతం చె ల్లించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసి కార్మికులకు ఉద్యోగులుగా గుర్తించి ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్ర క్రియ చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ సంస్థలో 16 వేల మంది రిటైరయ్యారని.. ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఆర్టీసీలో నెల కొన్న సమస్యలపై తమ వైఖరిని తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. మరోవైపు ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ.. తమ సమ్మెపై ఇప్పటికే లేబర్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చామ న్నారు. ఆర్టీసీపై మీ వైఖరి చెప్పాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను వారు డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే మిగిలిన కార్మిక సంఘాలు కలిసి రావాలన్నారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులు, ప్రైవేట్ బస్సులను నడపొద్దని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే 7వ తేదీ నుంచి సమ్మె జరుగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసి ఉద్యోగులకిచ్చిన హామీల సమస్యల పరి ష్కారం కోసం ముందుకు వచ్చి ఈ సమ్మెను నివారించే ప్రయత్నం చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ సంస్థలో పారిశ్రామిక అశాంతి కలగకుండా చూడాలని జేఏసీ కోరుతోందన్నారు.

## రైతన్నా ధైర్యంగా ముందుకు రా..

- **నీ ధాన్యనికి మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
- **కొందుర్గ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:** రైతులు ఎంతో కష్టంతో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మంగళవారం కొందుర్గ్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 మద్దతు ధర చెల్లిస్తున్నాం. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రా ల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రవాణా, హమాలీలు, గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ప్రతి కుటుంబ ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కొందుర్గ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, సహకార సంఘాల చైర్మన్లు బక్కన్న యాదవ్, దామోదర్ రెడ్డి, డైరెక్టర్లు మల్లేశ్, కరుణాకర్, భాస్కర్, నవీన్, భరత్, రవినాయక్, శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూర్ బస్వాం, ఇబ్రహీం, బాలరాజు గౌడ్, సుదర్శన్ గౌడ్, హరినాద్ రెడ్డి, నర్సింలు, కుమారస్వామి గౌడ్, చంద్రశే ఖర్, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్, కొమ్ము కృష్ణ, మహబూబ్ షరీఫ్, రఘునందన్ సుదర్శన్, అనిల్, గంగామోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని అభినందించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్

**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** నిషేధిత గంజా మాదకద్రవ్యాలను గుర్తించి పట్టుబడిన కేసులో, మొత్తం 30 కిలోల డ్రై గంజా, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకొని, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినందుకు ఎన్‌ఫో ర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి, అదనపు కమిషనర్ ఖురేష్ నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని అభినందిం చారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి రూ.15,000 నగదు బహుమతిని అందజేసి, భవిష్యత్‌లో మరిన్ని కేసులను గుర్తించేందుకు కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్ర మంలో సీఐ స్వప్నా, ఎస్ఐ రామకుమార్, సిబ్బంది హమీద్, అవినాష్, విష్ణు, సుకన్య, శ్యామ్ సుందర్, సాయి కుమార్ లు నగదు బహుమతిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, ఎస్టిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవని, ఎక్స్‌సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 108 రకాల పండ్లతో పూజలు



**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** రామారెడ్డి మండల కేంద్రంలో ఇసనపల్లి గ్రామం కొలువైన దక్షిణ కాశీగా పిలువబడే శ్రీ కాలభైరవ క్షేత్రం వైశాక మాసం మొదటి రోజున 108 రకాల పండ్లతో పూజలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ కాలభైరవ స్వామి గుడి చైర్మన్ గంజి సతీష్ గుప్తా కామారెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంట్ అసోసియేషన్స్ అధ్యక్షుడు లక్ష్మీ నర్సాగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అడిగే శ్రీనివాస్ గుప్తా, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్ గుప్తా మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మరిల్లు శ్రీనివాస్ మరియు గణేష్ సంజీవరెడ్డి ,కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**చట్టం,నిజాంసాగర్ :** నిజాంసాగర్ మండల కేంద్రంలో మంగళవారం సిఎం సహాయ నిధి చెక్కులను పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్,మండల అధ్యక్షులు ఎలె మల్లికార్జున్ పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం చిగురించింది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంకల్పానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ప్రతి పేద కుటుంబానికి అవసరమైన సమయంలో ప్రభుత్వ మద్దతు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. సీఎం ఆర్.ఎఫ్. ద్వారా మానవతా దృక్పథంతో ప్రజలకు అండగా నిల బడుతున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనిస్ పటేల్, గాండ్ల రమేష్,బింగి శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి,రాము రాథోడ్,వడ్ల బ్రహ్మం,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com